


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com






హైదరాబాద్ | శుక్రవారం 11-12-2020 | RNI No.52865/93 Postal No.H/SD/258/2018-2020 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక:111 | పేజీలు:4 | వెల: రూ.1/-


# సిద్దిపేటకు అంతర్జాతీయ విమానాశ్రయం



### ఐటి టవర్స్ నిర్మాణానికి శంకుస్థాపనలో సీఎం కెసిఆర్
### మెడికల్ కాలేజీ,ఆస్పత్రి భవనాలకు శంకుస్థాపన
### టిఆర్ఎస్ కార్యాలయం,రైతువేదికకు ప్రారంభోత్సవం
### పలు అభివృద్ధి కార్యాక్రమాలకు జిల్లాలో శ్రీకారం

సిద్దిపేట,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): సిద్దిపేట జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సిఎం కెసిఆర్ శ్రీకారం చుట్టారు. వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న సిఎం కెసిఆర్ సిద్దిపేటలో అంతర్జాతీయ విమానాశ్రయం రాబోతున్నదని ప్రకటించారు. ఈ ప్రాంతంలో త్వరలోనే విమానాశ్రయం రానుందన్నారు. తన పర్యటనలో భాగంగా ఐటి టవర్స్ నిర్మాణం మొదలు, మెడికల్ కళాశాల నిర్మాణంతో పాటు పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. రైతువేదికను ప్రాంభించి కోమటి చెరవును పరిశీలించారు. సిఎం కెసిఆర్ వెంట మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, ఈటెల రాజేందర్, హరీష్ రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పలువురుఅధికారులు ఉన్నారు. రాష్ట్రం నలుచెరుగులా ఐటి విస్తరణకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా సిద్దిపేటకు ఐటి రంగం చేరుకుంది. సిద్దిపేట జిల్లా దుద్దెడలో కొత్తగా ఏర్పాటు చేయనున్న ఐటీ టవర్‌కు సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా సీఎం మాట్లాడుతూ ఇక్కడికి వచ్చిన పారిశ్రామికవేత్తలకు శుభాభినందనలు తెలిపారు. ఐటీ రంగంలో సిద్దిపేట పురోగతి సాధిస్తుందన్నారు. రాష్ట్ర రాజధానికి సిద్దిపేట అత్యంత సమీపంలో ఉందన్నారు. సిద్దిపేట అత్యంత క్రియాశీలక ప్రాంతమని, అద్భుతంగా అభివృద్ధి చెందుతున్నదని వెల్లడించారు. భవిష్యత్‌లో జిల్లా పరిధిలో అంతర్జాతీయ విమానాశ్రయం రానుందని చెప్పారు. సీఎం కేసీఆర్ సమక్షంలో పలు కంపెనీలతో ఒప్పందాలపై ఐటీ శాఖ కార్యదర్శి జయేశ్ రంజన్ సంతకాలు చేశారు. ఇందులో జోలాన్ టెక్నాలజీ , విసాన్ టెక్, ఎంబ్రోడ్స్ టెక్నాలజీ, సెట్విన్ వంటి కంపెనీలు ఉన్నాయి. దుద్దెడలో ఐటీ పార్కును మూడెకరాల విస్తీర్ణంలో రూ. 45 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నారు. ఇందులో 2 వేల మందికి ఉపాధి కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామ శివారులో నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాల నూతన భవనాన్ని సీఎం కేసీఆర్ ప్రారంభించారు. అదేవిధంగా 960 పడకల జనరల్ హాస్పిటల్ భవనానికి శంకుస్థాపన చేశారు. రూ.225 కోట్ల ఖర్చుతో జనరల్ హాస్పిటల్‌ను నిర్మించనున్నారు. అనంతరం సిద్దిపేటలోని కోమటి చెరువు వద్దకు చేరుకున్నారు. మినీ ట్యాంక్‌బండ్ సుందరీకరణ పనులను, నెక్లెస్ రోడ్డును పరిశీలించారు. పరిసరాల్లో కలియ తిరిగారు. అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిద్దిపేట మెడికల్ కాలేజీని సుమారు 25 ఎకరాల స్థలంలో రూ.135 కోట్లతో నిర్మించారు. ఈ భవనం 3 లక్షల చదరపు అడుగుల్లో మూడంతస్థుల్లో ఉన్నది. ఈ భవన సముదాయ నిర్మాణానికి సీఎం కేసీఆర్ 2017, అక్టోబర్ శంకుస్థాపన చేశారు. ఈ మెడికల్ కళాశాలలో మొత్తం 8 డిపార్ట్‌మెంట్లు ఉన్నాయి. గ్రౌండ్‌ఫ్లోర్‌లో లైబ్రెరీ, అటానమీ డిపార్ట్‌మెంట్‌తో పాటు అడ్మినిస్ట్రేన్ బ్లాక్‌తో పాటు రెండు తరగతి గదులు ఉన్నాయి. మొదటి అంతస్తులో రీడింగ్ రూమ్, రెండు తరగతి గదులు, బయోకెమిస్ట్రీ, ఫిజియాలజీలను ఏర్పాటు చేశారు. రెండో అంతస్తులో కమ్యూనిటీ మెడిసిన్ విభాగం, రెండు పరీక్ష గదులు, ఫార్మా కళాశాల్గ, ÷తాలజీ డిపార్ట్‌మెంట్లను ఏర్పాటు చేశారు. మూడో అంతస్తులో మైక్రో బయాలజీ డిపార్ట్‌మెంట్‌తో పాటు ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగం, క్యాంటీన్‌ను ఏర్పాటు చేశారు. మెడికల్ కళాశాల ప్రాంగణంలోనే విద్యార్థులకు హాస్టల్ వసతి కోసం 'జీప్లస్–5 విధానంలో బాలురు, బాలికలకు వేర్వేరుగా భవనాలను నిర్మించారు. 12,024 చదరపు అడుగుల్లో కిచెన్ బిల్డింగ్‌ను నిర్మించారు. బాలురు, బాలికలకు హాస్టల్ వసతితో పాటు కళాశాలలోని టీచింగ్ స్టాఫ్ కోసం 26 క్వార్టర్లు, నాన్‌టీచింగ్ స్టాఫ్ కోసం 36 క్వార్టర్లను 'జీ'ప్లస్–5 విధానంలో నిర్మించారు.

అదేవిధంగా ప్రిన్సిపాల్, హెచ్‌వోడీల కోసం ప్రత్యేక బ్లాక్‌లను నిర్మించారు. కళాశాల ఏర్పాటు కావడంతో సిద్దిపేట జనరల్ దవాఖానలో మెడికల్ కళాశాల తరగతులు ప్రారంభమయ్యాయి. 2018–19 మొదటి బ్యాచ్‌లో 150 మంది విద్యార్థులు, 2019–20 రెండో బ్యాచ్‌లో 175 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. 2020–21 మూడో బ్యాచ్‌కు అడ్మిషన్లు కొనసాగుతున్నాయి. ఇదే సముదాయంలో రూ.225 కోట్లతో 966పడకల జనరల్ దవాఖాన భవనాన్ని జీప్లస్ 7 పద్ధతిలో నిర్మించనున్నారు. దీనికి సీఎం కేసీఆర్ భూమిపూజ చేశారు. ఇకపోతే సిద్దిపేట అర్బన్ మండలంలోని మిట్టపల్లిలో కొత్తగా నిర్మించిన రైతు వేదికను సీఎం ప్రారంభించారు. పొన్నాల శివార్లలో కొత్తగా నిర్మించిన తెలంగాణ భవన్‌ను ప్రారంభించారు. సిద్దిపేట జిల్లాలో మొత్తం 127 రైతువేదికలను నిర్మిస్తున్నారు. ఇందులో ఇప్పటికే 110 రైతువేదికలు పూర్తయ్యాయి. మిగితావి వివిధ దశల్లో ఉన్నాయి. ఒక్కో రైతువేదికను 2,046 చదరపు అడుగులలో నిర్మించారు. ఒక్కో రైతువేదిక నిర్మాణానికి ప్రభుత్వం రూ.22లక్షలు మంజూరు చేసింది. రైతులంతా ఒక్క దగ్గర సమావేశమై మార్కెటింగ్, వ్యవసాయంలో నూతన విధానాలు తదితర అంశాలు చర్చించుకోవడానికి ప్రతి వ్యవసాయ క్లస్టర్‌కు ఒక రైతువేదిక నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టింది. సాగు పంటలపై రైతులంతా ఈ రైతువేదికల్లో సమావేశమై ఏయే పంటలు సాగు చేయాలో చర్చించుకుంటారు. హైదరాబాద్ : సిద్దిపేట జిల్లా పొన్నాల శివారులోని నిర్మించిన టీఆర్ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కాగా, గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయిదాకా బలమైన పునాదులు వేసుకున్న టీఆర్ఎస్ శ్రేణులకు సరైన దిశానిర్దేశర చేసేందుకు అన్ని జిల్లా కేంద్రాల్లో తెలంగాణ భవన్‌లను నిర్మించారు. రాష్ట్రంలోనే మొట్టమొదటి టీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయ భవనాన్ని సిద్దిపేటలో సీఎం ప్రారంభించారు. ఆయన వెంట మంత్రి హరీశ్‌రావు, జిల్లా నాయకులు పాల్గొన్నారు. రూ.60లక్షలతో నిర్మించిన పార్టీ కార్యాలయ భవన నిర్మాణానికి గత ఏడాది జూన్ 24న భూమిపూజ నిర్వహించి త్వరితగతిన పనులు చేపట్టి నిర్దేశిరచిన గడువులోగా పూర్తి చేశారు. సిద్దిపేట జిల్లా టీఆర్ఎస్ పార్టీ కార్యాలయ భవన నిర్మాణం రాష్ట్రంలోనే మోడల్‌గా నిలువనున్నది. జీ ప్లస్ 1 పద్ధతిలో నిర్మించారు. 1,500 మంది పార్టీ శ్రేణులు సమావేశంలో కూర్చుండే విధంగా సమావేశ హాల్ నిర్మించారు. మోడల్ కిచెన్ షెడ్, టాయిలెట్స్, విశాలమైన పార్కింగ్, ప్రహరీ తదితర పనులు పూర్తి చేశారు. మొత్తంగా భవన నిర్మాణానికి అన్ని కలుపుకొని రూ.1.5 కోట్లు ఖర్చు అయ్యాయి. భవనం చుట్టూ మొక్కలు నాటారు.

# వికాలంగ సీఆర్‌పీఎఫ్ జవాన్లకు నైపుణ్య శిక్షణ

### మానసిక,శారీరక ధృడత్వం పెంపొందించేలా తర్ఫీదు
### సైబర్ క్రైమ్ నేరాలను ఛేదించేలా నైపుణ్యాల కల్పన
### శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): విధి నిర్వహణలో భాగంగా వికలాంగ సీఆర్పీఎఫ్ సైనికులకు కేంద్రం సహాయ సహకారాలు అందిస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. గురువారం నేషనల్ సెంటర్ ఫర్ దివ్యాంగ్ ఎంపవర్మెంట్‌ను కిషన్‌రెడ్డి సందర్శించారు. విధినిర్వహణలో గాయపడిన వారి కోసం సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో ఈ సంస్థ పనిచేస్తోందన్నారు. దివ్యాంగ సైనికుల నైపుణ్య అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన మొట్ట మొదటి శిక్షణ కేంద్రాన్ని సందర్శించటం సంతోషంగా ఉందని చెప్పారు. సైనికుల శారీరక సామర్థ్యాన్ని, వివిధ రంగాల్లో వారి నైపుణ్యతను పెంచేలా శిక్షణ ఇవ్వడానికి ఈ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. ఫలితాల ఆధారంగా మిగిలిన పారా మిలిటరీ దళాలలో కూడా ఈ శిక్షణ అమలు చేయబడుతుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. యుద్ధ రంగంలో గాయపడి దివ్యాంగులుగా మారిన జవాన్లను శారీరకంగా మానసికంగా మరింత దృఢంగా తయారు చేసి వారి సేవలను కొనసాగించేందుకు కట్టుబడి చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. షామీర్ పేట్‌లోని రంగారెడ్డి జిల్లా సీఆర్పీఎఫ్ హెడ్ క్వార్టర్స్‌లో జాతీయ దివ్యంగుల సాధికారత కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీజీపీ మహేందర్ రెడ్డి, సీఆర్పీఎఫ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. యుద్ధ రంగంలో దివ్యాంగులుగా మారిన జవాన్లకు అండగా నిలిచేందుకు నేషనల్ సెంటర్ ఫర్ దివ్యాంగ ఎంపవర్మెంట్ సెంటర్ ను ఏర్పాటు చేశారు. ఈ సెంటర్లో సీఆర్పీఎఫ్ దివ్యాంగ జవాన్లను ఫిజికల్‌గా, మెంటల్‌గా ఫిట్ గా తయారు చేయడమే ఈ సెంటర్ ప్రధాన ఉద్దేశ్యం. సైబర్ క్రైమ్ నేరాలను ట్రేస్ చేసేందుకు దివ్యాంగ జవాన్లకు ఈ సెంటర్‌లో ట్రైనింగ్ ఇస్తారు. జాతీయ దివ్యాంగ సాధికారత కేంద్రంలో ఏర్పాటు చేసిన వివిధ విభాగాలను కిషన్ రెడ్డి పరిశీలించారు. ఇండోర్ స్పోర్ట్స్ స్టేడియం, మెడిటేషన్ సెంటర్, ఐటీ సెంటర్, హెల్త్ సెంటర్, పారా స్పోర్ట్స్ హాల్ లను పరిశీలించిన సందర్భంగా పలువురు దివ్యాంగ జవాన్లతో కిషన్ రెడ్డి స్వయంగా మాట్లాడారు. దివ్యాంగ జవాన్లను సైబర్ వారియర్స్ గా మారుస్తున్నామని సంస్థ డిజి ప్రకాష్ పరమేశ్వరి తెలిపారు. దేశంలో జరిగిన వివిధ ఘటనల్లో చాలా మంది జవాన్లు అమరులయ్యారు.. ఇంకా కొంత మంది జవాన్లు తమ కాళ్ళు, చేతులు పోగొట్టుకున్నారు.. ఇలాంటి వారిని శారీరకంగానే కాదు.. మానసికంగా కూడా మరింత దృఢవంతులుగా తయారు చేసి సైబర్ వారియలర్స్ గా మారుస్తామని సీఆరపీఎఫ్ డీజీ ప్రకాష్ పరమేశ్వరి చెప్పారు. సెంటర్ ను ప్రారంభించిన సందర్భంగా వివరాలను వెల్లడించారు. దేశ అంతర్గత భద్రత లో సైబర్ వార్ కూడా ప్రధానమైనది.. అలాంటి సైబర్ వార్ ని ఎదుర్కోవడానికి దివ్యాంగ జవాన్లను సైబర్ వారియర్స్ గా మారుస్తున్నాం.. స్పోర్ట్స్ లో రాణించిన దివ్యాంగ జవాన్లను పారా స్పోర్ట్స్ లో ట్రైనింగ్ ఇస్తున్నాం.. సుమారు 500 కి పైగా సీఆర్పీఎఫ్ జవాన్ల పిల్లలు కూడా దివ్యాంగులుగా ఉన్నారు. వారందరికీ ఈ సెంటర్ తోడ్పాటు అందిస్తుందన్నారు.

# నర్సాపూర్‌లో పేదలకు డబుల్ ఇళ్లు

### ప్రారంభించి లబ్దిదారులకు అందచేసిన సిఎం కెసిఆర్

సిద్దిపేట,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): జిల్లాలోని నర్సాపూర్‌లో కొత్తగా నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లను సీఎం కేసీఆర్ ప్రారంభించారు. పైలాన్ దగ్గర సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం లబ్దిదారులతో సామూహిక గృహప్రవేశాలు చేయించారు. గేటెడ్ కమ్యూనిటీని తలదన్నేలా ఈ డబుల్ బెడ్‌రూం ఇండ్ల సముదాయాన్ని ప్రభుత్వం నిర్మించింది. ఈ సముదాయంలో మొత్తం 2460 డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఉన్నాయి. ఈ కాలనీకి కేసీఆర్ నగర్‌గా నామకరణం చేశారు. నర్సాపూర్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్లను సకల హంగులతో నిర్మించారు. సుమారు రూ.163 కోట్ల వ్యయంతో 2460 ఇళ్ల సముదాయాన్ని నిర్మించారు. ఇందులో తొలివిడతగా 1341 ఇళ్లను సీఎం ప్రారంభించారు. అనంతరం సీఎం కేసీఆర్ సమక్షంలో 144 మంది గృహ ప్రవేశాలు చేశారు. మిగిలినవారు విడుతల వారీగా కొత్త ఇళ్లలోకి వెళ్లనున్నారు. లబ్దిదారులకు ఇంటి పట్టాతో పాటు కరెంట్ మీటర్ నంబర్, వాటర్ కనెక్షన్ మార్పిడి పత్రం, ప్రాపర్టీ టాక్స్, కామన్ అఫిడవిట్, వంట గ్యాస్ సంబంధిత పత్రాలను అందించారు. మిగిలిన 1119 ఇళ్లను దశలవారీగా అర్హులకు కేటాయించనున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు హరీష్ రావు, నిరంజన్ రెడ్డి వేముల ప్రశాంత్ రెడ్డి, ఎంపి ప్రభాకర్ రెడడ్డి, స్థానిక ఎమ్మెల్యే మదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కొత్త పార్లమెంట్ భవనానికి ప్రధాని మోడీ శంకుస్థాపన

### వేదోక్తంగా హోమాలతో భూమి పూజా కార్యాక్రమాలు
### సర్వమత ప్రార్థనలతో కార్యాక్రమానికి శోభ
### హోంమంత్రి అమిత్ షా, రాజ్‌నాథ్, స్పీకర్ బిర్లా తదితరుల హాజరు

న్యూఢిల్లీ,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): కొత్త పార్లమెంట్ భవన నిర్మాణానికి ప్రధాని మోదీ గురువారం శంకుస్థాపన చేశారు. మధ్యాహ్నం 12.50 నిమిషాలకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. వేద పండితులు మంత్రాల మధ్యహోమం కార్యక్రమం నిర్వహించి భూమి పూజ చేశారు. భూమాత, కూర్మ, వరహారూప, నవగ్రహ, నవరత్న భరిత శిల పూజలు నిర్వహించారు. నవకలశ స్థాపన తర్వాత శంకుస్థాపన చేశారు. ప్రధాని మోదీ పేరిట పండితులు భూ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. తొలిసారిగా దేశంలోని అన్ని మతాలకు చెందిన వారు ప్రార్థనలు నిర్వహించారు. 971 కోట్ల ఖర్చుతో సెంట్రల్ విస్టా కొత్త పార్లమెంట్ కార్యాలయాన్ని నిర్మించనున్నారు. 2022, ఆగస్టు 15 నాటికి ఇది పూర్తి కానున్నది. టాటా సంస్థకు నిర్మాణ పనులను అప్పగించారు. భూమిపూజ, శంకుస్థాన కార్యక్రమానికి రతన్ టాటా హాజరయ్యారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా,కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, ప్రహ్లాద ,పలువురు ఎంపిలు తదితరులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శంకుస్థాపన కార్యక్రమం సందర్భంగా బహుళ మత గురువులతో ప్రార్థనలు నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న పాత పార్లమెంట్ భవన నిర్మాణాన్ని ఆనాటి బ్రిటిష్ పాలకులు 1921లో ప్రారంభించారు. ఆరేళ్ల తర్వాత.. 1927లో ఆ భవన నిర్మాణం పూర్తి అయ్యింది. అయితే సెంట్రల్ విస్టా భవనాన్ని భారతీయ సంస్కృతి ప్రతిబింబిచేలా నిర్మించనున్నారు. ప్రధాని భూమిపూజ కార్యక్రమానికి సుప్రీంకోర్టు పలు పరిమితులను విధించింది. నిర్మాణాలూ కూల్చివేతలే కాదు, కనీసం ఒక చెట్టును కూడా అక్కడనుంచి కదల్చాడానికి వీల్లేదన్న విస్పష్టమైన ఆదేశంతో, భూమిపూజకు మాత్రమే సర్వోన్నత న్యాయస్థానం అనుమతించింది. ఈ భారీ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో వేలాది పిటిషన్లు దాఖలు కావడం, న్యాయస్థానమే ఈ అంశాన్ని సూమోటోగా స్వీకరించడం తెలిసిందే. నిర్మాణాన్ని రెండేళ్ళలో పూర్తిచేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఉంది. కొత్త పార్లమెంటు భవనాన్ని 2022 ఆగస్టులోగా పూర్తిచేసి, 75వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను కొత్త భవనంలో ఘనంగా జరపాలన్నది ప్రభుత్వ సంకల్పం. కొత్త పార్లమెంటు ఇంద్రభవనంలాగా ఉండబోతున్నదంటూ ప్రభుత్వం ఇప్పటికే సమస్త వివరాలూ తెలియచెప్పింది. ఇప్పటికంటే మరింత ఎక్కువ సంఖ్యలో లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు కూర్చునేందుకు వీలుగా, నాలుగేళ్ళ తరువాత జరగబోయే నియోజకవర్గాల పునర్విభజన పక్రియను కూడా దృష్టిలో ఉంచుకొని సీటింగ్ ఏర్పాట్లు ఉన్నాయి. ఉమ్మడి సమావేశాల్లో సైతం సభ్యులు సర్దుకోవాల్సిన అవసరం లేని రీతిలో ఏర్పాట్లు ఉండబోతున్నాయి. కొత్త పార్లమెంటు భవనం అవసరమా కాదా అన్న ప్రత్యేక అధ్యయనాలు అక్కరలేదనీ, సాక్షాత్తూ పార్లమెంటు సభ్యులే తగినంత ఆఫీస్ స్పేస్ లేదనీ, వ్యక్తిగత చాంబర్లూ ఆధునిక సౌకర్యాలూ లేవని ఫిర్యాదులు చేస్తున్నారని ప్రభుత్వం చెబుతోంది. పాత భవనం ప్రమాదకరంగా పరిణమిస్తున్నదనీ, కొత్తది కడితే భద్రతతో పాటు ఏడాదికి వెయ్యికోట్ల వృధాఖర్చును కూడా మిగల్చవచ్చునని ప్రభుత్వం వాదిస్తోంది. కొత్త పార్లమెంటు భవనం నిర్మాణంలో కామన్ సెంట్రల్ సెక్రటేరియట్, రాజ్‌పథ్ పునరుద్ధరణ, ఉపరాష్ట్రపతి, ప్రధాని కార్యాలయాలు, నివాసాలు, ఇతరత్రా మెరుపులూ మెరుగులతో కూడిన మొత్తం సెంట్రల్ విస్టా ప్రాజెక్టు రాబోతున్నది. కొత్త పార్లమెంటు భవనాన్ని ఆత్మనిర్భరతకు ప్రతీకగా ప్రధాని మోడీ ప్రకటించారు. కొత్త ప్రజాస్వామ్య దేవాలయంగా ఈ నిర్మాణాన్ని అభివర్ణించారు.



కొత్త పార్లమెంట్ భవనం సెంట్రల్ విస్టాకు బూమిపూజ చేసిన ప్రధాని మోడీ

# ఆత్మనిర్భర భారత్‌కు ప్రతీకగా నూతన పార్లమెంట్

### దేశ ప్రజలందరూ గర్వించాల్సిన క్షణమిది
### 130 కోట్ల మంది భారతీయులు గర్వించదగ్గ సుదినం
### 75 ఏళ్ల స్వాతంత్ర్యానికి గుర్తుగా కొత్త భవన నిర్మాణం
### భారతీయ సంస్కృతిలో భాగంగా మారిన ప్రజాస్వామ్యం
### ప్రపంచ దేశాల ప్రజాస్వామ్యానికి భారత్ తల్లి
### కొత్త పార్లమెంట్ భవన నిర్మాణం సందర్భంగా ప్రధాని మోడీ ప్రసంగం

న్యూఢిల్లీ,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): నూతన పార్లమెంట్ భవనం ఆత్మనిర్భర భారత్‌కు దిశానిర్దేశం చేయనుందని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భానికి గుర్తుగా ఈ భవనం నిలవనుందని చెప్పారు. దేశ ప్రజలందరూ గర్వించాల్సిన క్షణమని అన్నారు. నూతన పార్లమెంట్ భవనానికి శంకుస్థాపన చేసిన అనంతరం మోదీ ప్రసంగించారు. ప్రస్తుత పార్లమెంట్ భవనం స్వాతంత్య్రం తర్వాత దేశానికి దశదిశ నిర్దేశించిందని అన్నారు. ఈ రోజు భారతీయులకు చరిత్రాత్మక దినం. భారతదేశ ప్రజాస్వామ్య ప్రస్థానంలో ఈ రోజు ఎంతో ప్రత్యేకం. 130 కోట్ల మంది భారతీయులు గర్వించదగ్గ సుదినం. ఇది దేశ ప్రజలందరూ కలిసి నిర్మించుకుంటున్న భవనం. స్వాతంత్య్రం వచ్చి 75ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భానికి గుర్తుగా ఈ భవనం నిలవనుంది. ప్రస్తుత పార్లమెంట్ భవనంలోనే భారత రాజ్యాంగ రచన జరిగింది. బాబా సాహెబ్ అంబేడ్కర్, మరెందరో మహనీయులు పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో రాజ్యాంగ రచన పూర్తి చేశారు. చరిత్రను గౌరవిస్తూనే వాస్తవ అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకుని ఈరోజు నూతన భవనానికి శంకుస్థాపన చేశామని ప్రధాని మోడీ తన ప్రసంగంలో వివరించారు. నూతన పార్లమెంట్ భవనంలో అనేక విధాలైన ఆధునిక సౌకర్యాలు రానున్నాయి. పార్లమెంట్ పనితీరు మెరుగుదలకు కావాల్సిన అన్ని హంగులు, సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నాం.నూతన పార్లమెంట్ భవనం ఆత్మ నిర్భర్ భారత్‌కు దిశా నిర్దేశర చేయనుందని ప్రధాని మోదీ అన్నారు. స్వాతంత్య్రం వచ్చిన తొలినాళ్లలో ప్రజాస్వామ్యం ఓ విఫల ప్రయత్నం అని చాలా మంది అన్నారు. ఇప్పుడు వాళ్లందరూ చూస్తూ ఉండగానే ప్రజాస్వామ్య భారతం అద్భుతంగా పురోగమిస్తోంది. మాగ్నా కార్టా కంటే ముందే భారతదేశంలో హక్కుల కోసం ప్రయ్నతాలు జరిగాయి. భారతదేశంలో ప్రజాస్వామ్యానికి అంతకు ముందు నుంచే ఎన్నో ప్రయత్నాలు జరిగాయి. దేశ ప్రజాస్వామ్య ప్రస్థానానికి దాదాపు వెయ్యేళ్ల చరిత్ర ఉంది. అప్పటి నుంచే ప్రజాస్వామ్య ప్రయాణానికి బాటలు వేశారు. 10వ శతాబ్దంలో తమిళనాడులోని ఓ గ్రామంలో పంచాయతీ వ్యవస్థ గురించి సవివరంగా పేర్కొన్నారు. రుగ్వేదంలో కూడా ప్రజాస్వామ్యం గురించి ప్రస్తావన ఉంది. భారతదేశం సమాజ మూలాల్లోనే ప్రజాస్వామ్యం విధానాలు ఉన్నాయి. భారత దేశ తత్వ చింతన అంతా ప్రజాస్వామ్యం ఆధారంగానే సాగింది. ప్రపంచ ప్రజాస్వామ్య వ్యవస్థలకు మన దేశం పురిటిగడ్డ. దేశ ప్రజాస్వామ్య ప్రయాణం ఎప్పటికప్పుడు నిత్యనూతనంగా సాగుతోంది. దేశంలో ప్రతి ఎన్నికకూ ఓటింగ్ శాతం పెరుగుతూ వస్తోంది. భిన్నమైన అభిప్రాయాలు ఉన్నప్పటికీ ప్రజాస్వామ్యంపై మాత్రం ఎవరికీ వ్యతిరేకత లేదన్నారు. సభ లోపల, బయటా సంవాదాలు దేశం కోసమే. మన ప్రతి నిర్ణయంలో 'దేశం మొదట' అన్న భావనే ఉండాలి. పార్లమెంట్ నూతన భవనం కూడా ఒక దేవాలయమే. ఈ దేవాలయంలో ప్రాణప్రతిష్ట చేయాల్సింది రానున్న ప్రజాప్రతినిధులే అని ప్రధాని మోదీ అన్నారు

కొత్త పార్లమెంట్ భవన నిర్మాణానికి ఇవాళ శంకుస్థాపన జరిగిందని, ఇది చరిత్రాత్మకమైన రోజు అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. 130 కోట్ల మంది భారతీయులకు ఇది చరిత్రాత్మకమైన సందర్భం అని, కొత్త పార్లమెంట్ భవనం.. పాత, కొత్త సహజీవనానికి ఉదాహరణగా నిలుస్తుందన్నారు. సమయం, అవసరాలకు తగినట్లు మార్పులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. 2014లో తొలిసారి ఓ ఎంపీగా పార్లమెంట్ హౌజ్‌లో ప్రవేశించిన రోజున తన జీవితంలో ఎన్నడూ మరిచిపోనన్నారు. ప్రజాస్వామ్య ఆలయంలోకి ప్రవేశించిన తర్వాత.. తానెప్పుడూ తన శిరస్సును వంచి ప్రజాస్వామ్య ఆలయానికి సెల్యూట్ చేసినట్లు ప్రధాని మోదీ తెలిపారు. పాత పార్లమెంట్ భవనం స్వాతంత్య ఉద్యమానికి పూర్వం మార్గదర్శకం చేసిందని, అయితే కొత్త పార్లమెంట్ భవనం ఆత్మనిర్భర్ భారత్‌కు సాక్షిగా నిలుస్తుందని మోదీ అన్నారు. పాత పార్లమెంట్ భవనంలో గత వందేండ్లలో ఎన్నో పునర్ నిర్మాణాలు జరిగాయని, ఇప్పుడు ఆ బిల్డింగ్ రెస్ట్ కోరుకుంటోం దని, 21వ శతాబ్దానికి కొత్త బిల్డింగ్‌ను ఇవ్వడం మన బాధ్యత అని ఆయన అన్నారు. ప్రజాస్వామ్యం భారత్‌లో ఓ సంస్కృతిగా మారిందని, ఇక్కడ ప్రజాస్వామ్యం ఓ జీవన శైలి అని, అదే ఈ దేశ ప్రాణమని, శతాబ్దాల అనుభవం నుంచి భారత ప్రజాస్వామ్య వ్యవస్థ బలపడిందని ప్రధాని మోదీ తెలిపారు. కొత్త భవన నిర్మాణం దేశ చరిత్రలో మైలురాయి అని అన్నారు. దేశంలో ఎన్నో మార్పులు జరిగాయని, కానీ ప్రజాస్వామ్యమే మన ఆత్మగా కొనసాగుతోందన్నారు. ప్రపంచదేశాలు భారత్‌ను ప్రజాస్వామ్యానికి తల్లిగా గుర్తిస్తారని ప్రధాని అన్నారు. రాజకీయ పార్టీల మధ్య భిన్నమైన అభిప్రాయాలు ఉన్నా.. ప్రజాసేవే ప్రజాప్రతినిధుల లక్ష్యం కావాలన్నారు. ఇండియా ఫస్ట్ అన్న సంకల్పం తీసుకోవాలని అన్నారు. భారతదేశ వికాసమే ఆరాధన కావాలన్నారు. 2047లో భారత స్వాతంత్యానికి వందేళ్లు నిండుతాయని, అప్పుడు దేశం ఎలా ఉండాలన్న సంకల్పంతో పనిచేయాలన్నారు. ఇతరదేశాలతో పోలిస్తే భారత్‌లో ఓటర్ల సంఖ్య పెరుగుతోం దన్నారు. రాజకీయ పార్టీల మధ్య వ్యత్యాసాలు ఉన్నా.. వేరు కావొద్దన్నారు. మన ప్రజాస్వామ్యానికి ఎటువంటి ప్రమాదంలేదని ప్రధాని అన్నారు.ఎంపీలంతా స్వచ్ఛమైన సేవతో కొత్త పార్లమెంట్ బిల్డింగ్‌కు ప్రాణ ప్రతిష్ట చేస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ ఓం బిర్లా, మంత్రులు రాజ్‌నాథ్ సింగ్,అమిత్ షా, రవిశంకర్ ప్రసాద్, నిర్మలా సీతారామన్ తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణలో పెరుగుతున్న చలితీవ్రత

### –ఆదిలాబాద్ జిల్లాలో అత్యధిక కనిష్ట ఉష్ణోగ్రతలు

హైదరాబాద్,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్రంలో చలి తీవ్రత క్రమంగా పెరుగుతోంది. ప్రధానంగా ఏజెన్సీ ఏరియాల్లో క్రమంగా చలి పెరుగుతోంది. రాత్రి ఉష్ణోగ్రలు పడిపోతున్నాయి. ప్రజల వెన్నులో వణుకు పుట్టిస్తోంది. మధ్యాహ్నం దాటినా ఇంటినుంచి బయటకు రావడానికి జనం జంకుతున్నారు. సూరీడు పది తరవాత గానీ రావడం లేదు.

రాత్రిపూట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, సంగారెడ్డి జిల్లాల్లోని 9 మండలాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు పది డిగ్రీల కంటే తక్కువగా నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. జిల్లా కేంద్రాల వారీగా ఉష్ణోగ్రతల నమోదును చూస్తే నల్గొండ మినహా అన్నిచోట్లా గరిష్ట ఉష్ణోగ్రతలు 30డిగ్రీల కంటే ఎక్కువగా నమోదయ్యాయి. అధికంగా ఖమ్మం 32.6 డిగ్రీలు, నిజామాబాద్ 32.4డిగ్రీల చొప్పున రికార్డయ్యాయి. అత్యల్పంగా ఆదిలాబాద్‌లో 10.6 డిగ్రీలు, మెదక్‌లో 11.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక ఉదయం సమయంలో దట్టంగా పొగమంచు కమ్ముకుంటోంది. రహదారులు కనిపించకుండా కప్పేస్తోంది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు వాహనదారులు. మరోవైపు చలి నుంచి రక్షించుకోవడానికి ప్రజలు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. ఉన్ని దుస్తులు, స్వెట్టర్లు ధరిస్తున్నారు. అయినప్పటికీ చలి తీవ్రత తగ్గకపోవడంతో గ్రామాల్లో, పట్టణాల్లో ఎక్కడ చూసినా చలి మంటలు కాచుకుంటున్నారు.

## చరిత్రలో నేటినిజం





(డిసెంబర్ 11 దిలీప్‌కుమార్ జననం...)

-రాధశ్రీ

సెల్: 9494481210

# వైద్యరంగానికి సవాల్‌గా ఏలూరు వింతవ్యాధి !

నేటినిజం
శుక్రవారం 11-12-2020

పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం ఏలూరులో విస్తరిస్తున్న వింతరోగంపై ఇంకా స్పష్టత రాలేదు. ఇప్పటికే కరోనాతో అల్లాడుతున్న ప్రజలకు ఇప్పుడు పులిమీద పుట్రలా దాపురించింది. వ్యాధి కొత్తది కావడంతో సర్వత్రా ఆందోళన నెలకొంది. ఇది కేవలం ఏలూరుకే పరిమితం అనుకోవడానికి లేదు. వ్యాధి విస్తరిస్తున్న తీరు చూస్తుంటే ఇది కూడా ఓ అంటువ్యాధిలా ప్రబలే ప్రమాదం ఉందన్న భయాలు వస్తున్నాయి. ఇప్పటికే అక్కడ ఎయిమ్స్,ఐఐసిటి తదితర వైద్య బృందాలు పరిశోధనలు చేపట్టాయి. అసలు వ్యాధికి గల కారణాలు తెలియక అందరూ తలలు పట్టుకుంటున్నారు. రోజులు గడుస్తున్నా వ్యాధి తగ్గకపోగా రోగుల సంఖ్య పెరుగుతోంది. వ్యాధి లక్షణాలు కనిపిస్తున్నాయి కానీ.. వ్యాధి సోకడానికి కారణాలు తెలియడం లేదు. ఢిల్లీ నుంచి ఎయిమ్స్ డాక్టర్లు, హైదరాబాద్ నుంచి నిపుణులు వచ్చి పరీక్షలు చేస్తున్నారు. ఫలితాల కోసం చూస్తున్నారు. కొంతమంది నిఫా వైరస్ అంటున్నారు. దీంతో ఇప్పుడు ఏలూరుకు రావాలంటేనే చాలామంది వణుకుతున్నారు. కొందరు ఇక్కడ ఉన్నవారు ఇతర ప్రాంతాలకు తరలివెళుతున్నారు. ఏలూరుతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్ని వణికిస్తున్న వ్యాధి నిజంగా వైరస్సేనా? అనే అనుమానాలు కూడా మొదలవు తున్నాయి. క్రమేపీ ఈ మహమ్మారి నగరమంతా విస్తరించడం చూస్తుంటే మరింత ఆందోళన కలుగుతోంది. అయితే అంతు చిక్కని వ్యాధి విజృంభిస్తుండటంతో బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ప్రభుత్వాసుపత్రి కిటకిట లాడుతోంది. అనేక మంది బాధితులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరినవాళ్లు ఇప్పటి వరకు 200 నుంచి 300 మంది వరకు ఉండొచ్చని అంచనా. ప్రజల్లో భయాందోళనలు పెరగడంతో నగరంలోని 62 వార్డు సచివాలయాల వద్ద ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని డీఎంహెచ్‌వో సునంద తెలిపారు. ప్రస్తుతం అధికారిక లెక్కల ప్రకారం నలుగు రైదుగురు మాత్రమే చనిపోయారి అంటున్న మృతుల సంఖ్య ఎక్కువేనని అంటున్నారు. పాలు, నీళ్లలో వ్యాధికి సంబంధించిన ఆనవాళ్లు ఉన్నాయంటూ వార్తలు వచ్చాయి. వైద్యం చేస్తున్న డాక్టర్లకు కూడా ఇది అంతు చిక్కడం లేదు. దీంతో నిపుణులైన వైద్య బృందాలకూ ఇది సవాల్‌గా మారింది.. కారణాలు తెలుసు కునేందుకు కసరత్తు చేస్తున్నారు. ఢిల్లీ ఎయిమ్స్ నుంచి వచ్చిన డాక్టర్లు ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పరిస్థితుల్ని అడిగి తెలుసుకున్నారు. స్థానిక డాక్టర్ల నుంచి సమాచారం తీసుకున్నారు. ఫీల్డ్ లెవల్లో వేరే బృందాలు పర్యటి స్తున్నాయి. ఇప్పటికే 40 మంది వ్యాధిగ్రస్తుల నుంచి శాంపిల్స్ తీసుకున్నారు. మరికొంత మంది రోగుల నుంచి నమూనాలు సేకరించాలని ఎయిమ్స్ డాక్టర్లు సూచించారు. తొలి దశ నమూనా పరీక్షల్లో బాధితుల శరీరంలో సీసం, నికెల్ లోహాలున్నట్టు ప్రాథమిక నిర్ధారణ అయినట్లు సమాచారం. గోదావరి, కృష్ణా కాలువ లోని రసాయనాల వల్లే లెడ్, నికెల్ వంటి భారలోహాలు ఏలూరు నగర వాసుల శరీరంలోకి ప్రవేశించాయా లేక మరింకేమైనా ఆహార పదార్థాల రూపంలో వెళ్లాయా అనే దానిపై వివిధ బృందాలు సేకరించి రూపొందించిన నివేదికలు ఒకటి,రెండు రోజుల్లో వెలువడనున్నాయి. వింత వ్యాధికి గల కారణాలు అప్పుడే వెలుగు చూడను న్నాయి. అంతుచిక్కని వ్యాధితో ఆసుపత్రి పాలై కోలుకున్నారని ఇంటికి పంపిన బాధితులను ఇంకా ఆరోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. ఫిట్స్ తగ్గినా పూర్తిస్థాయిలో కోలుకోవడంలేదు. షుగరు, వెన్నునొప్పి, తలనొప్పి, నీరసం, భయం, కాళ్లూ, చేతులు గుంజుకుపోవడం, నరాలు సలపడం వంటి పలురకాల సమస్యలతో బాధ పడుతున్నారు. కొందరైతే ఇంకా లేచి కూర్చోలేని పరిస్థితిలో ఉన్నారు. పూర్తిస్థాయిలో కోలుకోకుండానే తమను ఇంటికి పంపేశారని వాపోతున్నారు. వ్యాధి తీవ్రత కారణంగా నగరంలోని అన్ని ప్రాంతాల్లోను 108 అంబులెన్సులతో సిబ్బంది అప్రమత్తంగా ఉంచారు.

ఏలూరు ప్రభుత్వాసుపత్రి వద్ద అత్యవసర విభాగంలోనే అన్నిరకాల వైద్య నిపుణులు, సిబ్బంది వైద్య సేవలను అందిస్తున్నారు. ఇప్పటి వరకూ ఏ ఒక్కరూ ప్రాణాపాయ పరిస్థితిలో లేరని అందరూ ఆరోగ్యంగానే ఉన్నారని వైద్యులు చెబుతున్నారు. ఏలూరు వింతవ్యాధి వైద్యరంగానికి సవాల్ విసిరిన నేపథ్యంలో కేంద్ర వైద్య బృందం రంగంలోకి దిగింది. నగరంలోని పలు ప్రాంతాలకు వెళ్లి పరిశీలించారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రికి వచ్చి వైద్యుల బృందంతో చర్చించారు. వార్డుల్లో వున్న బాధితుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని స్వయంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. కొంత మంది నుంచి రక్త నమూనాలను సేకరించారు. కేంద్ర బృందంతో పాటు మంగళగిరి ఎయిమ్స్ బృందం ఆసుపత్రిలో బాధితులను ప్రతిక్షణం పరిశీలిస్తూ వారి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీస్తున్నారు. ఒకవైపు వ్యాధికి సంబంధించిన లక్షణాలను ఆరా తీస్తూనే అనారోగ్యానికి గురైన వారికి ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఫిట్స్‌తో పడిపోయిన వారు వైద్యసేవలు అందాక త్వరగా కోలుకుంటున్నారని అధికారులు చెబుతున్నారు. అత్యవసర సేవలు 24 గంటలూ అందుబాటులో ఉంటాయని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం వైద్య ఆరోగ్య శాఖ చెబుతోంది. నగరంలో రాబోయే నాలుగు రోజులు ప్రత్యేకంగా పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చెప్పారు. జిల్లా ఆసుపత్రిలో 24 గంటలపాటు వైద్యసేవలు అందించేలా.. ఒక్కో వార్డుకు ఒక్కో వైద్యుడికి విధులు కేటాయించారు. ఇప్పుడు ఉన్నవాటికి తోడు అదనంగా పది అంబులెన్స్‌లు రప్పిస్తున్నారు. అంతుచిక్కని వ్యాధికి గల కారణాలు గుర్తించేందుకు విస్తృతంగా కృషి చేస్తున్నామని ఆరోగ్యశాఖమంత్రి ఆళ్ల నాని అన్నారు. నీటి నమూనాలు సేకరించామని, పాల నమూనాలను కూడా తీసుకుంటామన్నారు. విజయవాడ నుంచి నమూనాల ఫలితాలు రావాల్సి ఉందన్నారు. ఏలూరులో ప్రజల అస్వస్థతకు దారి తీసిన కారణాలను పూర్తి స్థాయిలో పరిశోధించాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. ఏలూరు ప్రాంత ప్రజల శరీరాల్లోకి సీసం లాంటి మూలకాలు ఎలా చేరాయో పరిశీలించాలన్నారు. వీటిపై ప్రజారోగ్య సిబ్బంది, ఇతర విభాగాలు నిశిత పరిశీలన చేయాలని సూచించారు. అస్వస్థులైన వారికి అందిస్తున్న వైద్య సేవలపై ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆరా తీశారు. మొత్తంగా ఈ వ్యవహారంలో జగన్ సర్కార్ చాలా చురుకుగా పనిచేస్తోంది. అలాగే వైద్యుఉల కూడా నిరంతరంగా శ్రమిస్తున్నారు. అయితే వ్యాధి ఏమిటన్నది తెలిస్తే తప్ప దానికి విరుగుడు కనిపెట్టలేం. అయితే ప్రజలు ఆహారం,మంచినీరు, పాలవంటి పదార్థాలతో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మొత్తంగా ఇప్పుడు కరోనా కన్నా మిన్నగా ఇది సవాల్ విసురుతోంది. వ్యాధి లక్షణాలు, కారణాలు గుర్తించి అందుకు విరుగుడు చర్యలు తీసుకుంటే తప్ప పరిస్థితి సాధారణస్థితికి రాకపోవచ్చు. అప్పటి వరకు వైద్యరంగానికి ఇది సవాల్ విసరడం ఖాయంగా కనిపిస్తోంది.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై నిషేదాజ్ఞలు కొనసాగింపు

### – కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి

కరీంనగర్. డిసెంబర్ 10 (నేటినిజం ప్రతినిధి): సాధారణ పౌరులు, ప్రధానంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కరీంనగర్ కమీషనరేట్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమల్లో ఉన్న నిషేదాజ్ఞలను ఈనెల 24 వరకు పొడిగించడం జరిగిందని కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి మద్యం ప్రియులు పాల్పడుతున్న ఆగడాలపై పలు ఫిర్యాధులు వస్తున్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు.

మద్యం సేవించి మద్యం ప్రియులు వీధుల్లో, రోడ్లపై అసభ్యపదజాలంతో మాట్లాడుతుడటం అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందిగా పరిణమించింది. మద్యంప్రియుల ఆగడాలకు కళ్ళెం వేయడంతోపాటు ప్రజల భద్రత, రక్షణ కోసం ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది. పరిస్థితుల ప్రభావం దృష్ట్యా ఈ కాల పరిమితి పొడిగించబడే అవకాశం ఉంది. ఐపిసి 188, హైదరాబాద్ నగర పోలీసు చట్టం, ఫసలీ నిబంధనలనుసరించి నిషేదాజ్ఞలు ఉల్లఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

డిజెలపై నిషేధాజ్ఞలు పొడగింపు

కరీంనగర్ కమీషనరేట్ పరిధిలో డిజె సౌండ్‌ల వినియోగంపై అమల్లో ఉన్న నిషేదాజ్ఞలను ఈనెల 24వరకు పొడగించడం జరిగిందని పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. చిన్నపిల్లలు, వృద్ధులు, రోగులు, విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం కలుగకుండా శబ్దకాలుష్యం నుండి కాపాడేందుకు భారీ సౌండ్‌లతో కూడిన డిజె సౌండ్‌ల వినియోగంపై నిషేదాజ్ఞలు విధించడం జరిగిందని పేర్కొన్నారు.

వివిధ కార్యక్రమాల సందర్భంగా ప్రజల సమీకరణ, ప్రదర్శనల కోసం డిజె సౌండ్‌లను వినియోగిస్తున్న విషయం విదితమే. వివిధ కార్యక్రమాల నిర్వాహణకు మైక్‌సెట్ వినియోగం తప్పనిసరి అనిపిస్తే సంబంధిత డివిజన్ ఎసిపిల అనుమతి పొందాలని సూచించారు. ఏ ఏ ప్రాంతాల్లో ఏమేరకు ఏ స్థాయిలో మైక్‌సెట్‌లు వినియోగించాలో పరిమితులున్నాయని పేర్కొన్నారు. కమీషనరేట్ పరిధిలో ఇప్పటి వరకు డిజెల వినియోగంపై యజమానులకు అవగాహన కల్పించడం జరిగిందని, పరిస్థితుల ప్రభావం దృష్ట్యా ఈ కాల పరిమితి పొడిగించబడే అవకాశం ఉంది. నిషేదాజ్ఞలు ఉల్లఘించే వారిపై ఐపిసి 188, హైదరాబాద్ నగర పోలీసుచట్టం, ఫసలి నిబంధనలనుసరించి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

## మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ



రాజన్న సిరిసిల్లా, డిసెంబర్ 10 (నేటినిజం ప్రతినిధి): చందుర్తి మండలం ఏన్గల్ మాజీ సర్పంచ్ లాండె జగ్గయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా గురువారం మృతుని కుటుంబాన్ని టీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి పరామర్శించారు, ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లింగంపల్లి సత్తయ్య, మాజీ ఉప సర్పంచ్ జనార్ధన్, నాయకులు లాండె లింగయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు,

## పత్రికా స్వేచ్ఛను కాలరాస్తే సహించేది లేదు




రాజన్న సిరిసిల్లా, డిసెంబర్ 10 (నేటినిజం ప్రతినిధి): పత్రికా స్వేచ్ఛను కాలరాస్తే సహించేది లేదని చందుర్తి మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్ అన్నారు, హైదరాబాద్ పటాన్ చెరువు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి భూ కబ్జాలకు సంబంధించిన వార్తలను అక్కడి విలేకరి పత్రికల్లో రాయగా సదరు పాత్రికేయున్ని ఫోనులో నాన బూతులు తిడుతూ చంపుతామని బెదిరించిన ఎమ్మెల్యేపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు, గురువారం చందుర్తి మండల కేంద్రంలో ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో పాత్రికేయులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు, ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన పత్రికా స్వేచ్ఛను కాపాడవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఎంతైనా ఉందన్నారు, రాష్ట్రంలో జర్నలిస్టులపై దాడులు, దూషణలు జరగకుండా చూడాలన్నారు, అనంతరం తాసిల్దార్ కార్యాలయంలో ఉప తాసిల్దార్ గోపాల్ కు వినతి పత్రం అందజేశారు, ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు ఏనుగుల కృష్ణ, సీనియర్ జర్నలిస్టు గొట్టె మనోహర్, పాత్రికేయులు పోనిశెట్టి మహేష్, మారుపాక నవీన్ , బొల్లేవార్ శ్రీనివాస్, శ్రీపతి శ్రావణ్ ,మోహినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# కబ్జాల ఆరోపణల్లో అధికార పార్టీ నేతలు

### మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యేలపై ఆరోపణలు
### బెదిరింపులు.. తెగింపులతో ముందుకు వెళుతున్ననేతలు
### జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డికి వ్యతిరేకంగా నేడు చేర్యాల బంద్

హైదరాబాద్,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): అధికార టిఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధుల అవినీతి బాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. భూకబ్జాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. మంత్రి మల్లారెడ్డి తన భూమిని కబ్జా చేశారంటూ ఓ మహిళ కోర్టుకెక్కింది. ఈ మేరకు తన భూమికి సంబంధించిన కాగితాలను మాడియాముందుంచారు. అలాగే పటాన్‌చెరువు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి భూకబ్జా వార్తలు రాసిన ఓ విలేకరిని ఏకంగా కాళ్లూ చేతులు నరుకుతానని బెదిరించాడు. ఇలా జిల్లాల్లో అధికారపార్టీ నాయకుల దందాలు వెలుగు చూస్తున్నాయి. తాజాగా జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి అవినీతి కూడా వెలుగు చూసింది. గతంలోనే ఆయన జనగామలో కుంటను ఆక్రమించుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. అయితే ఈ ఆరోపణలపై అధికార పార్టీ ఎక్కడా స్పందించడం లేదు. అలాగే సిఎం కెసిఆర్ కూడా స్పందించడం లేదు. తాజాగా సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలో జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి భూరాజకీయం కలకలం రేపుతోంది. ఇక్కడి పెద్ద చెరువు కింద ఎన్నో ఏళ్ల నుంచి పశువుల సంతగా వాడుకుంటున్న భూమిని ఎమ్మెల్యే తన కుటుంబ సభ్యులతతో కొనిపించడం మొదలుకొని బఫర్ జోన్‌లో నిర్మాణం చేపట్టడం, స్థలం మునగకుండా మిషన్ కాకతీయ ఫండ్స్ తో కాంక్రీట్ కాలువ నిర్మిస్తుండడం దాక ఎమ్మెల్యే అనేక రూల్స్ ఉల్లంఘించారని, అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని స్థానికులు, ప్రజాసంఘాల నాయకులు, ప్రతిపక్ష నేతలు ఆరోపిస్తున్నారు. ఈక్రమంలో 'చేర్యాల పరిరక్షణ సమితి' ఆధ్వర్యంలో కొద్దిరోజులుగా వివిధ రూపాల్లో నిరసన తెలుపుతున్న పట్టణవాసులు శుక్రవారం చేర్యాల బంద్‌కు పిలుపునివ్వడం కొసమెరుపు. ఇప్పుడీ వ్యవహారం జిల్లాలో సంచలనం కలిగిస్తోంది. పెద్ద చెరువు మత్తడి భూమిని ఎమ్మెల్యే కబ్జా చేసి, రూల్స్‌కు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపిస్తూ శుక్రవారం చేర్యాల పట్టణ బంద్‌కు చేర్యాల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పిలుపునిచ్చారు. పెద్ద చెరువు మత్తడి నుంచి సహజ సిద్ధంగా నీరు బయటకు పోకుండా కాల్వను నిర్మించడం వల్ల భవిష్యత్తు లో చేర్యాల పట్టణానికి ముప్పు వాటిల్లుతుందని స్థానికులు, ప్రజాసంఘాల నాయకులు, వివిధ పార్టీల నేతలు ఆరోపిస్తున్నారు. ఎప్పట్లాగే ఆ స్థలాన్ని పశువుల సంత కోసం వినియోగించాలని, కాలువ నిర్మాణాన్ని ఆపివేయాలని డిమాండ్ చేస్తున్నారు. బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ సుమారు పదివేల కరపత్రాలను ముద్రించి పట్టణమంతా పంపిణీ చేస్తున్నారు. చేర్యాల పట్టణంలో పెద్దచెరువు కింద1402 సర్వే నెంబరులో 20 గుంటల భూమిని 2013 లో అజీజ్ అహ్మద్ నూర్ ఫ్యామిలీ నుంచి కృష్ణారెడ్డి, వసీమ్ ఖాన్ కొనుగోలు చేశారు. వీరు 2015లో ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. ఆ స్థలంలో దశాబ్దాలుగా పశువుల సంత కొనసాగుతుండడం, ఇతర ప్రజా అవసరాలకు వినియోగిస్తున్నందున స్థానికులంతా సమావేశ మయ్యారు. ఈ వివాదం నడుస్తుండగానే స్థానిక ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి తన కూతురు తుల్జాభవాని రెడ్డి పేరిట 1250 గజాలు, మారుతి ప్రసాద్, జితేందర్ రెడ్డి అనే వ్యక్తుల పేరిట మరో 1250 గజాల స్థలం కొనుగోలుచేశారు. తుల్జాభవానిరెడ్డి పేరిట ఇంటి నిర్మాణానికి అప్పటి చేర్యాల గ్రామ పంచాయతీ నుంచి అనుమతి తీసుకున్నారు. ఆ తర్వాత 2018 ఆగస్టు 2న చేర్యాల మునిసిపాల్టీగా ఏర్పడింది. మున్సిపాలిటీగా ఏర్పడక ముందే ఆదరాబాదరగా పంచాయతీ నుంచి పర్మిషన్ తీసుకున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కానీ మున్సిపాలిటీ అధికారులు నిర్మాణాన్ని అడ్డుకునే అవకాశముందని భావించి తావే ముందుగా హైకోర్టును ఆశ్రయించారు. ఎమ్మెల్యే ముత్తిరెడ్డి పక్కా ప్లాన్ ప్రకారం 20 గుంటల భూమిని తన కటుంబసభ్యులు, అనుచరుల పేరిట చేసి నిర్మాణాలు మొదలుపెట్టారు. ఏటా వానాకాలం చెరువు మత్తడి దూకినప్పుడల్లా వచ్చే వరద నీటితో స్థలం ముంపునకు గురయ్యే ప్రమాదముందని తెలిసి మరో ప్లాన్ వేశారు. రెండు నెలల క్రితం భారీ వర్షాలకు చెరువు నిండి వరద నీరు పట్టణంలోకి వచ్చింది. దీనిని సాకుగా చూపుతూ చెరువు కట్ట కింద పది మీటర్ల పరిధిలో కాంక్రీట్ కాలువ నిర్మాణం ప్రారంభించారు. మిషన్ కాకతీయ కింద చెరువు బ్యూటిఫికేషన్‌కోసం ఇరిగేషన్ శాఖకు మంజూరైన రూ.41లక్షలను ఈ కాలువ కోసం వినియో గిస్తున్నారు. ఎమ్మెల్యే తన కూతురు స్థలాన్ని కాపాడుకునేందుకే దీనిని నిర్మిస్తున్నారని స్థానికులు, చేర్యాల పరిరక్షణ సమితి సభ్యులు ఆరోపిస్తున్నారు. 300 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చేర్యాల పెద్ద చెరువును ఆనుకుని 30 మీటర్ల వరకు బఫర్ జోన్‌గా ఆఫీసర్లు నిర్ధారించారు. బఫర్ జోన్ లో పట్టాదార్లు కేవలం ఎ÷-లాంటేషన్ మినహా ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని నిబంధనలు చెబుతున్నాయి. ఎమ్మెల్యే ముత్తిరెడ్డి రూ.10కోట్ల విలువైన భూమిని ఆక్రమించడమేగాక అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని ఇటీవల పలుమార్లు ఆందోళనకు దిగారు. ఈవిషయంలో ఉన్నతాధికారులు లోతుగా దర్యాప్తు చేస్తే ఎమ్మెల్యే కోసం నిబంధనలను ఉల్లంఘించిన ఆఫీసర్లంతా ఊచలు లెక్కపెట్టక తప్పదని అంటున్నారు. మొత్తానికి ముత్తిరెడ్డి వ్యవహారంతో పాటు ఇతర నేతలపై వచ్చిన ఆరోపణలపై సిఎం కెసిఆర్ స్పందాస్తారా లేదా అన్నది చూడాలి.

# వ్యవసాయ చట్టాలతో పౌరసరఫరాల సంస్థ ఎత్తేస్తారా?

### అనేక అనుమానాలున్నాయంటున్న ఆందోళనకారులు

న్యూఢిల్లీ,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): ఢిల్లీలో జరుగుతున్న ఆందోళనను దేశప్రజలంతా గమనిస్తున్నారు. ఇందులో పంజాబ్, హర్యానకు చెందిన రైతులే ఎక్కువగా ఉంటున్నారు. అలాగే గతంలో గోధుమలను బహిరంగ మార్కెట్లో కార్పోరేట్ సంస్థ కొనుగోలు చేయాలన్న పంజాబ్ రైతులే ఇప్పుడు ఆందోళనకు దిగడం కూడా ఇక్కడ గమనించాలి. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వాలు ఇప్పటికీ సబ్సిడీ బియ్యాన్ని, గోధుమలను అందిస్తున్నాయి. సబ్సిడీలను వస్తురూపంలో కాదు, నగదురూపంలో ఇవ్వాలన్న ప్రపంచబ్యాంకు నిర్దేశాలను ఒక్కొక్క రంగంలో ప్రభుత్వాలు పాటిస్తున్నాయి. కాంగ్రెస్ అంటే యూపిఎ హయాంలోనే ఇలా జరిగింది. అప్పుడూ నగదు బదిలీ అన్నది మొదలయ్యింది. సబ్సిడీ గ్యాస్‌కు సంబంధించి తాజాగా నదదు బదిలీ జరుగుతోంది. ఇప్పుడంతా నగదు బదిలీ సాగుతోంది. రేపు సబ్సిడీ ఆహారాన్ని ఉపసంహరించుకుంటే, అప్పుడు భారత ఆహార సంస్థ ఉనికి ఉంటుందా అన్న అనుమానాలు ప్రధానంగా వస్తున్నాయి. ధాన్యం సేకరణ మద్దతు ధరా ఉండకపోతే ఎలా అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే లోక్‌సత్తా అధినేత జయప్రకాశ్ లాంటి వారు చట్టాలను స్వాగతిస్తున్నారు. రైతులు తమ ఉత్పత్తులను కార్పోరేట్ స్థాయికి తీసుకుని వెళ్లగలగాలని అంటున్నారు. అప్పుడే రైతులకు పోటీగా ధనర దక్కగలదని భరోసా ఇస్తున్నారు. ఉత్పత్తి రేటు పెరుగుతున్న కాలంలో, ధాన్యాన్ని తెగనమ్ముకోవలసిన దుస్థితిలో రైతు పడిపోతాడని మరికొందని వాదనగా ఉంది. మారుమూల ప్రాంతాలలోని చిన్న కమతపు రైతు, స్వేచ్ఛగా ఎక్కడికైనా వెళ్లి అమ్ముకోవచ్చునని చెప్పడం ఎలా సాధ్యమని వాదించే వారూ ఉన్నారు. అయితే ఆహార ఉత్పత్తుల రంగంలోకి అడుగిడిగిన వారు నేరుగా రైతుల వద్దకే వెళ్లి ధాన్యాన్ని కొనుగోలు చేస్తారని చెబుతున్నారు. ఇదే అనుమానంతో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు రైతులకు అండగా నిలబడుతున్నారు. అనేకమంది, ఉద్యమకారులకు ఆర్థికమైన అండదండలందిస్తున్నారు. ప్రవాస భారతీయులే కాదు, వారితోపాటు సంఘీభావంగా స్థానికులు కూడా అనేక దేశాలలో ఊరేగింపులలో, ప్రదర్శనలలో పాల్గొంటున్నారు.

# ఖమ్మం ఎన్నికల కోసం టీఆర్ఎస్ ముందుజాగ్రత్త

### అభివృద్ధి పనులతో ప్రజలను మచ్చిక చేసుకునే యత్నం
### గ్రేటర్ ఫలితాలతో దూకుడు మీదున్న బిజెపి

ఖమ్మం,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): వచ్చే ఏడాది ఖమ్మం కార్పొరేషన్ ఎన్నికలు రానున్నాయి. ఖమ్మంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు అధికార టిఆర్ఎస్ పూనుకుంది. ఇటీవలే ఇక్కడ ఐటి టవర్స్‌ను మంత్రి కెటిఆర్ ప్రారంభించారు. లకారం చెరువు మినీ ట్యాంక్‌బండ్‌ను కూడా ప్రారంభించి పవివి గ్రహానికి నివాళి అర్పించారు. దమ్ముంటే బిజెపి నేతలు పివికి భారతరత్న వచ్చేలా చేయాలని కెటిఆర్ సవాల్ కూడా చేశారు. అలాగే డబుల్ ఇళ్లను వేగవంతం చేశారు. మంత్రి పువ్వాడ అంతా తానై అభివృద్ధి పనులను మెల్లగా పట్టాలకు ఎక్కిస్తున్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ఈ హడావిడి చేస్తున్నారని గమనించాలి. అయితే మాజీమంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాత్రం ఈ కార్యక్రమాల్లో ఎక్కడా కానరావడం లేదు. అలాగే మాజీ ఎంపి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అనూహ్యంగా భారత్ బంద్ సందర్భంగా కెటిఆర్‌తో కలసి పాల్గొన్నారు. ఖమ్మం కార్పోరేషన్‌కి త్వరలో ఎన్నికలు జరుగనున్నాయి. మార్చి వరకు ఈ కార్పొరేషన్ పదవీ కాలం ఉంది. ప్రస్తుతం ఎస్టి జనరల్‌గా ఉన్న మేయర్ పదవి ఇప్పుడు ఓసి జనరల్ మహిళకు రిజర్వ్ అయ్యింది. గత ఎన్నికల సమయంలో తుమ్మల నేతృత్వంలో కార్పోరేషన్‌ను టిఆర్ఎస్ దక్కించుకొంది. ఇప్పుడు కూడా కార్పొరేషన్‌ను కైవశం చేసుకోవాలని అధికార పార్టీ ప్రణాళికలు సిద్దం చేస్తోంది. స్థానిక సమస్యలపై ఉద్యమాలకు దిగుతూ, మరోపక్క అసంతృప్తులను ఆకర్షించే పనిలో దూకుడుగా ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. గోళ్లపాడు చానల్ ఆధునీకరణ పేరుతో అధికార పార్టీ వంద కోట్ల అభివృద్ధి పనులను చేపడితే నిర్వాసితుల కోసం బిజెపి ఆందోళనలు చేపట్టి, బిసి కమిషన్‌ని ఖమ్మం తీసుకొచ్చింది. ఆందోళనలకు మద్దతుగా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సంజయ్‌ను కూడ పిలిపించింది. మరో వైపు కాంగ్రెస్ తో పాటు అధికార పార్టీలో ఉన్న పలువురు అసంతృప్తులు బిజెపి వైపు చూస్తున్నారనే టాక్ ఉంది. ఈ నేతలను తమ వైపు తిప్పుకునేందుకు కమల దళం ప్రయత్నాలు చేస్తోంది. ఎలాగైనా ఖమ్మం కార్పొరేషన్‌లో పాగా వేయాలనే లక్ష్యంతో బిజెపి పనిచేస్తోందనే వాదనలు వినిపిస్తున్నాయి.

మరోవైపు దుబ్బాక, జీహెచ్ ఎంసీ ఫలితాలు కమల దళానికి జోష్ నిచ్చాయి. ఖమ్మంలోనూ తన పాచికను పారించాలని ఆ పార్టీ చూస్తోంది. దీంతో కార్పొరేషన్ ఎన్నికలే లక్ష్యంగా స్థానిక సమస్యలపై దూకుడు ప్రదర్శించేందుకు రంగం సిద్ధం చేసుకుంటోంది. అసంతృప్తులను ఆకర్షించే పనిలో బిజెపి బిజీగా ఉంది

తెలంగాణలో బిజెపి మంచి ఊపులో ఉంది. ఓ పక్క దుబ్బాక, మరోపక్క జీహెచ్ ఎంసీ ఫలితాలు కమల దళానికి అంతులేని ఉత్సాహాన్నిస్తున్నాయి.

## ఉపాధిహామీతో వాననీటి సంరక్షణ

### –పనులను పరిశీలించిన కేంద్ర బృందం

రంగారెడ్డి,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): జిల్లాలోని మంచాల మండలం లోయపల్లిలో వర్షపు నీటిని సంరక్షించేందుకు గుట్టల దిగువన ఉపాధి హామీ పథకం కింద నిర్మిస్తున్న ఫారం పాండ్, వర్మీ కంపోస్ట్ షెడ్'పనులను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ సెక్రెటరీ రోహిత్ కుమార్ బృందం పరిశీలించింది. రూ.4 లక్షల అంచనా బ్జడెట్ తో నిర్మిస్తున్న ఈ ఫారం పాండ్ పని తీరును వారు అభినందించారు. ప్రతి గ్రామంలో చదువుకున్న ఇద్దరు మహిళా కూలీలకు ఉపాధి హామీ పథకం మేట్‌లుగా నియమించి, శిక్షణ ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఉపాధి హామీ పనులతో గ్రామీణ పేదలకు ఆర్థిక లబ్దితో పాటు, మౌలిక వసతుల అభివృద్ధికి ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. ఈ పర్యటనలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ అమరేంద్ర ప్రసాద్ సింగ్, కన్‌స్టలెంట్ కిరణ్ కుమార్, రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఎం రఘునందన్ రావు, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్, స్పెషల్ కమిషనర్ బి సైదులు, జాయింట్ కమిషనర్ పి జగత్ కుమార్ రెడ్డి, డి ఆర్ డి ఓ రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

## మానవహక్కులను హరిస్తోన్న మోడీ సర్కార్

### –ట్విట్టర్ వేదికగా రాహుల్ విమర్శలు

న్యూఢిల్లీ,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): కేంద ప్రభుత్వంపై కాంగ్రెస్ నేత, ఎంపీ రాహుల్ గాంధీ విమర్శనా స్త్రాలు సంధించారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పేదల ప్రాథమిక హక్కులను హరిస్తోందని ఆరోపించారు. మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ట్విట్టర్ వేదికగా మోదీ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. 'పేదల హక్కులను లాక్కుంటోంది. ఇది మానవత్వానికి వ్యతిరేక నేరం. ఈ దేశ ఉత్తమ భవిష్యత్తు కోసం మనం అన్ని వర్గాలను గౌరవించాలి' అని రాహుల్ పేర్కొన్నారు. ప్రతి ఏటా డిసెంబరు 10న మానవ హక్కుల దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఐక్యరాజ్య సమితి సాధారణ సభ 1948 డిసెంబర్ 10న సార్వత్రిక మానవ హక్కుల ప్రకటనను ఆమోదించిన నేపథ్యంలో దినోత్సవాన్ని జరుపుకుంటారు.

## వివాహ వేడుకకు హాజరైన ఎమ్మెల్సీ కవిత



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్10: జిల్లాలోని ముస్తాబాద్‌లో జరిగిన తన కారు డ్రైవర్ వివాహ వేడుకలకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దంపతులు హాజరయ్యారు. జిల్లాలోని ముస్తాబాద్ మండల కేంద్రంలోని ఏఎంఆర్ గార్డెన్‌లో తన కారు డ్రైవర్ నామాపూర్‌కు చెందిన జినుక దేవయ్య వివాహం విజయలక్ష్మితో గురువారం జరుగగా ఎమ్మెల్సీ కవిత భర్త అనిల్‌కుమార్‌తో కలిసి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. స్థానిక గ్రామ పంచాయతీలో పాలకవర్గ సభ్యులు కవితను సన్మానించారు.

## డైనమిక్‌లీడర్ కేసీఆర్

### కేసీఆర్ ఆధ్వర్యంలో అనూహ్య అభివద్ధి
### వ్యాక్సిన్ తయారీలో ముందంజ
### ప్రపంచానికే టీకా కేంద్రంగా హైదరాబాద్
### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్

హైదరాబాద్,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): దేశంలోనే తెలంగాణ కొత్తగా ఏర్పడిన రాష్ట్రమని, డైనమిక్‌లీడర్ కేసీఆర్ నేతత్వంలో చాలా తక్కువ సమయంలోనే అనూహ్యమైన అభివద్ధిని సాధించిందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమూశ్‌కుమార్ అన్నారు. తెలంగాణ ఏర్పడిన ఆరు సంవత్సరాల్లో అమల్లోకి తీసుకు వచ్చిన ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో దేశంలోనే మొదటి ర్యాంక్‌లో నిలిచిందన్నారు. 64 దేశాలకు చెందిన విదేశీ రాయబారులు భారత దేశంలో వ్యాక్సిన్ తయారీలో ముందంజలో ఉన్న రాష్ట్రము నకు చెందిన రెరడు ప్రధాన పారిశ్రామిక యూని÷–ల్టెన భారత బయోటెక్ లిమిటెడ్ , బయోలాజికల్ సంస్థలను బుధవారం సందర్శించారు. భారత దేశం తీసుకుంటున్న కొన్ని కీలక పరిశోధన, అభివద్ధి కార్యకలపాలను విదేశీ రాయబారులు,హైకమిషనర్లకు తెలియజేయడానికి భారత విదేశీ వ్యవహారాల శాఖ ఈ పర్యటనను నిర్వహించింది. ఈ ఉన్నత స్థాయి బందాన్ని రెరడు బ్యాచ్ లుగా విభజించి , మొదటి బ్యాచ్ ను భారత బయోటెక్ లిమిటెడ్ కు సందర్శన నిమిత్తం తీసుకెళ్లారు. రెరడవ బ్యాచ్ బయోలాజికల్ ఈ సంస్థ ను సందర్శించింది. తదుపరి ఈ బ్యాచ్ ను భారత బయోటెక్ లిమిటెడ్ కు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్ విదేశీ ప్రముఖులను స్వాగతిస్తూ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అతితక్కువ సమయంలోనే దేశంలోనే అద్భుతమైన పురోగతి సాధించిందని అన్నారు. గత ఆరు సంవత్సరాలలో దేశంలో సులభతర వ్యాపారం చేయడంలో రాష్ట్రం ముందున్నదని అన్నారు. హైదరాబాద్ నగరం భౌగోళికంగా దేశానికి మధ్యలో వున్నదని తెలిపారు. విమాన , రోడ్డు రవాణా వ్యవస్థలతో అనుసంధానమై ఉందని తెలిపారు.

# శాస్త్రోక్తంగా శ్రీ వరాహస్వామివారి ఆలయ సంప్రోక్షణ

## హోమగుండాలలో మహాపూర్ణాహుతి నిర్వహణ

తిరుమల,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): తిరుమల శ్రీ వరాహస్వామివారి ఆలయంలో గురువారం ఉదయం మకర లగ్నంలో బాలాలయ సంప్రోక్షణం వైఖానస ఆగమోక్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీ వరాహ స్వామివారి ఆలయంలో ఏర్పాటు చేసిన యాగశాలలో వేంచేపు చేసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామివారిని, శ్రీ వరాహస్వామివారి ఉత్సవర్లను సుప్రభాతంతో మేల్కొలిపి, పుణ్యాహవచనం, విష్వక్సేనారాధన, ప్రధాన కుంభారాధన, అర్చన నిర్వహించారు. అనంతరం శ్రీ వరాహస్వామివారి ప్రధాన హోమగుండమైన సభ్యహోమ గుండంలో మహా పూర్ణాహుతి నిర్వహించారు. తరువాత విమాన గోపురం, ద్వార పాలకులు, ఎదురు ఆంజనేయస్వామివారికి, విష్వక్సేనులవారికి, భాష్యకారులవారి హోమగుండాలలో మహా పూర్ణాహుతి జరిగింది. శ్రీశ్రీశ్రీ పెద్ద జీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామివార్లు ప్రబంధ శాత్తుమొర నిర్వహించారు. తరువాత సుముహూర్తంలో భగవత్ వైఖానస ఆగమోక్తంగా ఆచార్య పురుషులు బాలాలయంలోని శ్రీ వరాహస్వామివారికి ప్రాణ ప్రతిష్ట నిర్వహించారు.

ఈ సందర్భంగా ఈవో మీడియాతో మాట్లాడుతూ శ్రీ వరాహస్వామివారి ఆలయ విమాన గోపురానికి బంగారు పూత పూయబడిన రాగి రేకులు అమర్చేందుకు బాలాలయం నిర్వహించినట్లు తెలిపారు. బంగారు తాపడం పనులు పూర్తవ్వడానికి దాదాపు 5 నెలలు సమయం పడుతుందన్నారు. కావున అప్పటి వరకు భక్తులకు శ్రీ వరాహస్వామివారి మూల విరామూర్తి దర్శనం ఉండదన్నారు. ఇందుకోసం డిసెంబర్ 5వ తేదీ నుండి బాలాలయం కార్యక్రమాలు నిర్వహించి, గురువారం ఉదయం బాలాలయ సంప్రోక్షణ శాస్త్రోక్తంగా నిర్వహించినట్లు తెలిపారు. తదుపరి మహా సంప్రోక్షణ జరుగువరకు స్వామి, అమ్మవార్లకు నిత్యకైంకర్యాలన్నీ ఇక్కడే నిర్వహిస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఈవో డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి దంపతులు, అదనపు ఈవో ఏ.వి.ధర్మారెడ్డి దంపతులు పాల్గొన్నారు. కంకణబట్టార్ వేణుగోపాల దీక్షితులు, వైఖానస ఆగమ సలహాదారులు మోహన రంగాచార్యులు, ఎన్ఎకె.సుందరవరదచార్యులు, ఎపి అనంతశయన దీక్షితులు, ఆలయ ప్రధాన అర్చకులు గోవిందరాజ దీక్షితులు, కృష్ణశేషాచల దీక్షితులు, ఆలయ డెప్యూటీ ఈవో హరీంద్రనాథ్, విజివో శ్రీ బాలిరెడ్డి, రుత్వికులు, అధికారులు పాల్గొన్నారు.

# గుడికో గోమాతను ప్రారంభించిన టిటిడి ఛైర్మన్

హైదరాబాద్,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్రంలో గురువారం 'గుడికో గోమాత' కార్యక్రమాన్ని టీటీడీ ప్రారంభించింది. హైదరాబాదు నగరం జూబ్లిహిల్స్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఒక ఆవు, దూడను ఉదయం 9 గంటలకు టీటీడీ ఛైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి అందజేశారు. గో సంరక్షణ, ప్రతి గుడిలోనూ పూజలు నిర్వహించేలా ఈ కార్యక్రమాన్ని ఇటీవల విజయవాడలోని కనకదుర్గమ్మ ఆలయంలో టీటీడీ శ్రీకారం చుట్టారు. రెండో విడుతగా తెలంగాణలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా ప్రతి గుడికి దేశవాళీ ఆవులను దానంగా ఇవ్వాలని టీటీడీ పిలుపునిచ్చింది.

# నిజాలు తెలుసుకుని మాట్లాడండి

## సోషల్ మీడియా ప్రచారంపై ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి ఆగ్రహం

గుంటూరు,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): అసెంబ్లీకి గైర్హాజరైన అంశంలో తనపై వస్తున్న వార్తలను గుంటూరు జిల్లా తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి ఖండించారు. తనపై కావాలనే పనిగట్టుకొని దుష్ప్రచారం చేస్తున్నారని శ్రీదేవి అన్నారు. తనను రాజకీయంగా దెబ్బతీసేందుకే ఇలాంటి వార్తలు సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్ఆర్ సీపీ అధిష్టానం ఆదేశాల మేరకే ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాలకు శ్రీదేవి హాజరుకాలేదంటూ సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతోంది. విషయం ఎమ్మెల్యే వరకు చేరడంతో ఆమె స్పందించారు. తన అత్తగారికి ఆరోగ్యం బాగోలేకపోవడం వల్లే సభకు రాలేదని.., ఈ విషయంపై ముందుగానే పార్టీ అధిష్టానానికి సమాచారం ఇచ్చినట్లు స్పష్టం చేశారు.ఇటీవల ఉండవల్లి శ్రీదేవి వివాదాల్లో చిక్కుకుంటున్నారు. పేకాట క్లబ్బులు నిర్వహిస్తున్నారన్న వార్తలకు తోడు అనుచరుల ఆరోపణలు, ఎంపీ నందిగం సురేష్ తో వివాదాలున్నాయంటూ ఉండవల్లి శ్రీదేవిపై పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. ఎంపీ నందిగం సురేష్‌తో వివాదాలు కొలిక్కి వచ్చినా.. పేకాట క్లబ్ అంశం మాత్రం ఆమెపై నెగిటివ్ ప్రచారం జరుగుతూనే ఉంది. మరోవైపు ఆమె పేరుతో వైరల్ అవుతున్న ఆడియో టేపులు, ఓ సామాజిక వర్గం గురించి ఆమె మాట్లిడనట్లుగా చెప్తున్న కాల్ రికార్డ్స్ శ్రీదేవిని ఇబ్బందుల్లోకి నెట్టాయి. వీటన్నింటిపై ఎమ్మెల్యే కౌంటర్లు ఇస్తూ వస్తున్నా వివాదాలు మాత్రం ఆమెను వదిలిపెట్టడం లేదు.ఈ వివాదాల కారణంగా ప్రతిపక్షానికి శ్రీదేవితో పాటు పార్టీ కూడా టా÷-గ్గ÷ట్ అవుతుందని భావించే ఆమెను సభకు రావొద్దంటూ అధిష్టానం ఆదేశించినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో ఆన్ లైన్ బెట్టింగ్, జూదాన్ని నిషేధిస్తూ తీసుకొచ్చిన చట్టం అంశంలో శ్రీదేవిని ప్రతిపక్ష తెలుగుదేశం లక్ష్యంగా చేసుకునే అవకాశముందనే వైసీపీ పెద్దలు ఆమెను అసెంబ్లీకి దూరంగా ఉంచారన్న ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ప్రచారంలో ఏ మాత్రం వాస్తవం లేదన్నారు శ్రీదేవి. పార్టీ పెద్దలు అసెంబ్లీకి రావొద్దని సోషల్ మీడియాలో వస్తున్న కథనాల్లో వాస్తవం లేదని.. నిజాలు తెలుసుకుంటే మంచిదని హితవు పలికారు.

# ప్రతి గ్రామానికి సాగు నీరు అందిస్తాం



యాదాద్రి భువనగిరి, డిసెంబర్10 : బస్వాపురం రిజర్వాయర్ ద్వారా బునాదిగాని కాలువ నుంచి మండలంలోని ప్రతి గ్రామానికి సాగు నీరు అందించి మళ్లీఎన్నికల్లో ఓట్లు అడుగుతామని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆత్మకూరు(ఎం) మండలంలోని లింగరాజుపల్లి, తుక్కాపురం, కప్రాయిపల్లి గ్రామాల్లో ఒక్కొక్కటి రూ.16 లక్షల నిర్మించిన గ్రామ పంచాయతీ నూతన భవనాలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలోని టీఆర్ఎస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వమన్నారు. మండలంలోని అన్ని గ్రామాలను సంపూర్ణంగా అభివృద్ధి చేసే బాధ్యత నాదేనని ఈ సందర్భంగా తెలిపారు. మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఆలేరు నియోజకవర్గంలోనే అధిక నిధులు మంజూరు చేశామన్నారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు మండలంలోని మోదుగుబావిగూడెం నుంచి కప్రాయిపల్లి ప్రధాన రోడ్డు వరకు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టి సమస్యను పరిష్కరించనున్నట్లు తెలిపారు.దేశంలో ఎక్కడలేనివిధంగా ప్రభుత్వం రైతు బంధు, రైతు బీమా, ఆసరా పింఛన్‌లు, కళ్యాణలక్ష్మిలాంటి పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్న ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా నిల్వాలన్నారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలలోని లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను అందజేశారు.

# నల్లమలలో పులి సంచారం

## కెమెరాకు చిక్కిన దృశ్యాలు

నాగర్‌కర్నూల్,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): నల్లమల్ల దట్టమైన అడవీ ప్రాంతంలో విహరిస్తున్న పెద్ద పులి దృశ్యాలు కెమెరాకు చిక్కాయి. నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం పరహాబాద్ అటవీ శాఖ సిబ్బందిలో ఒకరు ఈ దృశ్యాలను తన సెల్ ఫోన్‌లో బంధించారు. ఇందులో పులి గాండ్రింపు శబ్దం స్పష్టంగా రికార్డయ్యింది. పులి సంచరించిన ప్రాంతంలో నీళ్లు ఉండటంతో, అవి తాగడానికి పులి అటుగా వచ్చి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

# బెంగాల్లో పావులు కదుపుతున్న కమలనాథులు

## మమతకు ముచ్చెమటలు పట్టిస్తున్న నేతలు
## సొంత పార్టీ నుంచే మమతకు చేదు అనుభవాలు

కోల్‌కతా,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): బెంగాల్ ఎన్నికలకు ముందే అక్కడి రాజకీయం వేడెక్కుతోంది. మమతా బెనర్జీ సర్కార్‌ను ఇంటికి పంపేందుకు నడుం బిగించిన కమలనాథులు అక్కడ పాగా వేసేందుకు మాస్టర్ ప్లాన్ అమలు చేస్తున్నారు.

ఇందులో భాగంగా జాతీయ స్థాయి నేతలు అక్కడ పర్యటించి పరిస్థితిని తమకుఅనుకూలంగా మార్చుకుంటున్నారు. కమ్యూనిస్టులను దెబ్బతీసిన మమత ఇక తనకు ముప్పులేదనుకుంటున్న తరుణంలో కమలంతో సవాళ్లు ఎదుర్కొంటున్నారు. వచ్చే ఏడాది బెంగాల్ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగున్నాయి.. కానీ, ఇప్పటి నుంచే అధికార తృణమూల్ కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధం జరుగుతోంది.

మమత సర్కార్‌పై తీవ్ర స్థాయిలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా,అమిత్‌షాలు విరుచుకుపడ్డారు. వారు వరుస పర్యటనలతో అక్కడ బిజెపికి మరింత ఊపు తెస్తున్నారు. మమత అరాచక పాలనకు రాబోయే ఎన్నికల్లో ప్రజలు బుద్ది చెప్పబోతున్నారని విమర్శించారు. సౌత్ నార్త్ తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో కాషాయ జెండా ఎగరవేశామని.. బెంగాల్‌లో కూడా అధికారంలోకి రాబోతున్నామన్నారు. ఇక, బీజేపీపై విరుచుకుపడ్డారు బెంగాల్ సీఎం మమత బెనర్జీ. డబ్బు సంచులతో తమ ప్రభుత్వాన్ని బీజేపీ విచ్ఛిన్నం చేసే కుట్రకు పాల్పడుతోందని ఆరోపించారు. విపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో బీజేపీ చేసే కుట్రలను తమ రాష్ట్రంలో సాగనివ్వబోమని మమత స్పష్టం చేశారు. అవినీతి నేతలే బీజేపీతో చేతులు కలుపుతున్నారని విమర్శించారు. మొత్తానికి బెంగాల్‌లో బీజేపీ, అధికార తృణమూల్ కాంగ్రెస్ మధ్య రాజకీయం రోజుకో మలువు తీసుకుంటోంది. అయితే మమతా బెనర్జీకి ఆమె పార్టీ నుంచే సవాళ్లు వస్తున్నాయి. అనేకులు ఆమె పార్టీని వీడి బిజెపిలో చేరుతున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా బిజెపిలో చేరడానికి క్యూ కడుతున్నారు.

# ప్రత్యామ్నాయ రాజకీయ వేదికకు ఇదే సమయం !

హైదరాబాద్,డిసెంబర్10(ఆర్ఎన్ఎ):రైతులకు మద్దతుగా విపక్షాలు ఇచ్చిన భారత్ బంద్ పిలుపు దేశవ్యాప్తంగా సక్సెస్ కావడంతో రాజకీయ పార్టీల్లో ఉత్సాహం కనిపిస్తోంది. ఇదే క్రమంలో విపక్ష పార్టీల్లో ఐక్యత కనిపించింది. ప్రత్యేకంగా తెలంగాణ సిఎం, టిఆర్ఎస్ అధినేత కెసిఆర్ ఈ పరిణామాలను జాగ్రత్తగా గమనిస్తుంటారు. ఎందుకంటే బిజెపికి వ్యతిరేకంగా దేశంలో ప్రత్యామ్నాయాన్ని తీసుకుని రావాలని చూస్తున్న కెసిఆర్ ఈ పరిణామాలను తనకు అనుకూలంగా మలచుకునే అవకాశం ఉంది. డిసెంబర్‌లో ప్రాంతీయ పార్టీల సదస్సు నిర్వహిస్తానని గతంలోనే ప్రకటించిన కెసిఆర్‌కు తాజా పరిణామాలు ఉత్సాహాన్ని ఇచ్చేవిగా ఉన్నాయి. రాజకీయ సమీకరణాలకు ఇదే సమయమని కూడా పలు పార్టీలు ఆలోచిస్తున్నాయి. ఈ దశలో బిజెపికి వ్యతిరేకంగా నిర్వహించే సదస్సులో ఆయన ఆయా ప్రాంతీయ పార్టీలను సదస్సుకు పిలిచే అవకాశాలు ఉన్నాయి. ఇందులో తెలుగు రాష్ట్రాలలకు సంబంధించి వైకాపాను, టిడిపిని ఆహ్వానిస్తారా అన్నది చూడాలి. అలాగే బంద్‌లో కాంగ్రెస్, వైకాపా, టిఆర్ఎస్,టిడిపిలు కూడా పాల్గొన్న క్రమంలో ఈ పార్టీల మధ్య సయోధ్యకు అవకాశం ఉందా అన్నది భవిష్యత్ కార్యాచరణను బట్టి తేలనుంది. సిద్ధాంతపరంగా ఆయా పార్టీలు బిజెపిని విభేదిస్తున్నా ఎపిలో ఉన్న ప్రత్యేక పరిస్థితుల్లో వైకాపా కొంత మెతక వైఖరితో ఉంది. బిజెపితో సఖ్యతతో ఉంటోంది. అలాగే టిడిపి గతంలోనే కాంగ్రెస్‌తో అంటకాగింది. బిజెపిని వ్యతిరేకించింది. ఈ దశలో ఈ రెండు పార్టీలు కెసిఆర్ నిర్వహించే సదస్సుకు వస్తాయా అన్నది అనుమానం. అలాగే ఈ పార్టీలను కెసిఆర్ ఆహ్వానిస్తారా అన్నది కూడా అనుమానంగానే ఉంది. అయితే బిజెపితో యుద్ధం చేస్తామని ప్రకటించిన సిఎం కెసిఆర్ అన్ని పార్టీలను కలుపుకుని పోవాల్సి ఉంటుంది. నూతన వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని కోరుతూ ఆందోళన చేస్తున్న రైతాంగానికి భారత్ బంద్ ద్వారా దేశవ్యాప్తంగా అనూహ్యమైన సంఘీభావం వ్యక్తమైంది. ఈ సమస్య ఒకటి రెండు రాష్ట్రాల సమస్య కాదని, ఉద్యమిస్తున్న రైతాంగం డిమాండ్లు యావత్ వ్యవసాయరంగ భవిష్యత్తుతో ముడిపడి ఉన్నవని భారత్ బంద్‌కు లభించిన స్పందన చాటి చెప్పింది. సుదీర్ఘ పోరాటానికి సిద్ధపడి, ఢిల్లీ నగరంలో బైఠాయించిన లక్షలాది మంది రైతులు, దేశంలో రకరకాల ఉద్యమాలకు కూడా ప్రేరణగా మారుతున్నారు. మొత్తంగా వ్యవసాయరంగాన్ని కార్పొరేటీకరిం చడానికి జరుగుతున్న ప్రయత్నంలో బిజెపి ఉందన్న వాదనను బలంగా చాటారు. ప్రభుత్వం మాత్రం రైతుల కోసమే చట్టాలను తీసుకుని వచ్చామని, రైతులకు ఆదాయం పెంచాలన్న ఆలోచనతో ఉన్నామని తెలిపింది. అయితే రైతులు వెనక్కి తగ్గడం లేదు. అలాగే మద్దతు ఇస్తున్న పార్టీలు కూడా వెనక్కి తగ్గడం లేదు. ఈ దశలో పార్టీల ఐక్యతకు భారత్ బంద్ సహకరించిందనే చెప్పాలి. అయాచితంగా వచ్చిన ఈ అవకాశాలన్ని కెసిఆర్ ఎలా వినియోగించుకుంటారన్నది చూడాలి. బిజెపి విధానాలపై తీవ్ర ఆగ్రహంగా ఉన్న కెసిఆర్..బంద్‌కు మద్దతు ఇవ్వడం ద్వారా తెలియచేశారు. తెలంగాణ వ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు గట్టిగానే కేంద్రంపై విమర్శలు గుప్పించారు. మరోవైపు కార్పొరేట్ దిగ్గజాలకు సహాయపడడం కోసమే ఈ సంస్కరణలు తీసుకువస్తున్నారని రైతులు బలంగా విశ్వసిస్తున్నారు. కాంగ్రెస్ తదితర పార్టీలు కూడా ఇదే అభిప్రాయంతో ఉన్నారు. నిర్దిష్టంగా కేంద్రప్రభుత్వానికి సన్నిహితు లుగా పేరుపడిన అంబానీ, అదానీలను పేరు పెట్టి మరీ ప్రస్తావిస్తున్నారు. మొత్తంగా వ్యవసాయ చట్టాలు విపక్షాలకు అందివచ్చిన అస్త్రాలుగా భావిస్తున్నాయి. ప్రత్యామ్నాయ రాజకీయాలు నడపాలని అనుకుంటున్న కెసిఆర్ ఈ పరిణామాలను తనకు అనుకూలంగా మలచుకునే అవకాశం ఉంది. తెలంగాణ ఉద్యమాన్ని మించి రైతు ఉద్యమాన్ని కెసిఆర్ నడపబోతున్నారని, తెలంగాణ ఉద్యమంలో ప్రత్యక్షంగా

పాలుపంచుకోని మంత్రి తలసాని శ్రీనివాస్ కూడా వ్యాఖ్యానించడం ఇక్కడ గమనార్హం. అయితే వైకాపా ,టిడిపిలను కలుపుకుని పోతునే ఆయనకు బలం చేకూరుతుంది. ఈ రెండు పార్టీలను చేరదీస్తారా లేదా

అన్నది కూడా అనుమానంగానే ఉంది. అలాగే కెసిఆర్‌తో కలసి రావడనాఇకి ఎపి సిఎం, వైకాపా అధినేత వైఎస్ జగన్ సిద్దంగా ఉంటారా అన్నది కూడా అనుమానమే. ఇకపోతే బిజెపిపై గతంలో వ్యతిరేకతతో ఉన్న టిడిపి అధినేత చంద్రబాబు తాజా రాజకీయ పరిస్థితుల్లో బిజెపికి వ్యతిరేకంగా నడుస్తారా అన్నది చూడాలి.

భారత్ బంద్‌ను సమర్థించిన తెలంగాణ రాష్ట్ర సమితి ఉద్యమ సమయంలో ఇలాగే అనేకానేక ఎత్తులు వేసింది.ప్రభావం చూపేంతలా రైతు ఉద్యమాన్ని కొనసాగించడం కూడా సాధ్యమేనని టిఆర్ఎస్ భావిస్తోంది. భారత్ బంద్‌కు మద్దతు కాంగ్రెస్, టిఆర్ఎస్ పార్టీలు మద్దతు పలికాయి. జాతీయ స్థాయిలో బిజెపిపై పోరాటంలో ఈ రెండు పార్టీలూ కలిసి పని చేసే చాన్స్ ఉందా? అన్నది కూడా చర్చగా మారింది. భారత్ బంద్‌ను సక్సెస్ చేసేందుకు టిఆర్ఎస్‌కు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రంగంలోకి దిగారు. పార్టీ నిర్ణయం మేరకు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ భారత్ బంద్‌లో పాల్గొని విజయవంతం చేసింది. భారత్ బంద్‌కు ఇటు టిఆర్ఎస్ అటు కాంగ్రెస్ మద్దతు పలకడంతో రాజకీయ వర్గాల్లో కొత్త చర్చ మొదలైంది. రైతుల విషయంలో రెండు పార్టీలు ఒకే వైఖరి తీసుకోవడంతో ఆ రెండు పార్టీలు దగ్గరయ్యే పరిస్థితులు వస్తున్నాయా అన్న చర్చ మొదలైంది. ఇక ముందు కూడా బిజెపి విషయంలో టిఆర్ఎస్ పోరాటం చేసే పరిస్థితిలో కాంగ్రెస్ పార్టీతో కలిసి ముందుకు సాగుతారా అన్నది చూడాలి. పాలనలో బిజెపి ,కాంగ్రెస్ పార్టీలు జాతీయ స్థాయిలో విఫలం అయ్యాయని సీఎం కెసిఆర్ చాలా సందర్భాల్లో అన్నారు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్, బిజెపియేతర కూటమి అవసరం ఉందని స్పష్టం చేస్తూ వస్తున్నారు. ఆ దిశగా ఫెడరల్ ఫ్రంట్ అలోచనను కూడా బయట పెట్టారు. నిజానికి తెలంగాణలో కాంగ్రెస్ బాగా బలహీన పడిపోయింది. కాంగ్రెస్ కంటే ఇప్పుడు బిజెపియే పెద్ద శత్రువని, కనుక కాంగ్రెస్ ని కలుపుకుని బిజెపిని ఎదుర్కోవటంలో తప్పేం లేదని టిఆర్ఎస్‌లో కొందరి అభిప్రాయంగా ఉంది. మోడీకి వ్యతిరేకంగా రైతు ఉద్యమాన్ని నిర్మించాలన్న ఆలోచన కూడా టిఆర్ఎస్ నేతలు చేస్తున్నారు.ఉద్యమాలు నిర్వహించడంతో పాటు, వ్యూహాలు పన్నడంలోనూ దిట్టగా కెసిఆర్‌కు పేరుంది. ఈ అవకాశాన్ని ఎలా వినియోగించు కుంటారన్నది చూడాలి. అలాగే వైకాపా, టిడిపిలను తన ఉద్యమంలోకి ఎలా లాగుతారన్నది కూడా ముఖ్యమే. ఇప్పుడున్న వేడిలోనే ముందుకు సాగితేనే విపక్ష పార్టీలతో పాటు రైతులు కలసి వస్తారు.

# ఉపాధి హామీ పనులను పరిశీలించిన కేంద్ర బృందం



రంగారెడ్డి,: జిల్లాలోని మంచాల మండలం లోయపల్లిలో వర్షపు నీటిని సంరక్షించుటకు గుట్టల దిగువన ఉపాధి హామీ పథకం కింద నిర్మిస్తున్న 'ఫారం పాండ్', 'వర్మీ కంపోస్ట్ షెడ్' పనులను కేంద్ర గ్రామీణభివృద్ధి శాఖ జాయింట్ సెక్రెటరీ రోహిత్ కుమార్ బృందం పరిశీలించింది. రూ.4 లక్షల అంచనా బడ్జెట్ తో నిర్మిస్తున్న ఈ ఫారం పాండ్ పని తీరును వారు అభినందించారు. ప్రతి గ్రామంలో చదువుకున్న ఇద్దరు మహిళా కూలీలకు ఉపాధి హామీ పథకం మేట్‌లుగా నియమించి, శిక్షణ ఇవ్వాలని అధికారులకు సూచించారు.

ఉపాధి హామీ పనులతో గ్రామీణ పేదలకు ఆర్థిక లబ్ధితో పాటు, మౌలిక వసతుల అభివృద్ధికి ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. ఈ పర్యటనలో కేంద్ర గ్రామీణభివృద్ధి శాఖ డైరెక్టర్ అమరేంద్ర ప్రసాద్ సింగ్, కన్సల్టెంట్ కిరణ్ కుమార్, రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణభివృద్ధి శాఖ కమిషనర్ ఎం రఘునందన్ రావు, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్, స్పెషల్ కమిషనర్ బి సైదులు, జాయింట్ కమిషనర్ పి జగత్ కుమార్ రెడ్డి, డి ఆర్ డి ఓ రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

# పట్టు సడలించని రైతు సంఘాలు

## చలి వణికిస్తున్న వేళ ప్రభుత్వానికి సవాళ్లు
## చట్టాల రద్దు ఎజెండాను ముందుంచిన రైతులు

న్యూఢిల్లీ,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): కేంద్ర వివాదాస్పద వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు చేపట్టిన ఆందోళనలు 15వ రోజుకు చేరాయి. పక్షం రోజులుగా వారు చల్లటి చలిలో తమ ఆందోళన కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం ప్రతిపాదనలను తిరస్కరిస్తున్నారు. చట్టాలను రద్దు చేసుకుంటే తప్ప చర్చలు జరపమని తేల్చి చెప్పారు. ఇటీవలి బంద్‌తో వారిలో మరింత ఉత్సాహం నెలకొంది. తమమధ్య విభేదాలు లేవని ,ఐక్యంగా సాగుతున్నామని చాటిచెప్పయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో అఖిలపక్షనేతలు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కూడా కలిసి విన్నవించారు. ప్రభుత్వంవైపు నుంచి సరైన స్పందన లేకపోవడంతో ఆందోళనలను ఉధృతం చేయాలని రైతు సంఘాలు నిర్ణయించాయి. ఇందులో భాగంగా డిసెంబర్ 12న ఢిల్లీ–జైపూర్, ఢిల్లీ–ఆగ్రా రహదారులను దిగ్బంధించాలని, దేశవ్యాప్తంగా రహదారులపై టోల్ ఫీజు చెల్లించకూడదని పిలుపునిచ్చారు. ఈనెల 14న దేశవ్యాప్తంగా మరోమారు ఆందోళలన నిర్వహించనున్నారు. ఆరోజున ఉత్తర భారత రైతులంతా చలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొనాలని, దక్షిణ భారత రైతులు జిల్లా కేంద్రాల్లో ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడించాలని పిలుపునిచ్చారు. కొత్తగా రూపొందించిన చట్టాలను రద్దుచేయాలని సింఘు, టిక్రీ, ఘాజీపూర్, నోయిడా సహా ఢిల్లీ సరిహద్దుల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తున్నారు. దీంతో రైతులు బైఠాయించిన రహదారులను పోలీసులు మూసివేశారు. కాగా, మూడు వ్యవసాయ చట్టాల్లో ఏడు సవరణలు చేసేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఈమేరకు ఓ ముసాయిదాను సిద్ధంచేసి 13 రైతు సంఘాలకు పంపింది. అయితే, ఈ ముసాయిదాను రైతు సంఘాలు తిరస్కరించాయి. చట్టాలను రద్దుచేయాల్సిందేనని స్పష్టం చేశాయి. తమ ఉద్యమాన్ని నీరుగార్చాలని ప్రభుత్వం చూస్తోందని, అది కుదిరే విషయం కాదని రైతు సంఘాలు స్పష్టం చేశాయి. ఈ ఉద్యమంలో మరికొంత మంది రైతులు చేరుతారని రైతు సంఘాల నేతలు ప్రకటించారు. మరోవైపు అమిత్‌షాతో చర్చలు జరుగుతున్న సమయంలోనే రైతు సంఘాల మధ్య విభేదాలు వచ్చినట్లు, చీలికలు వచ్చినట్లు పుకార్లు వచ్చాయి. ఓ వర్గం వారే కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో చర్చలు జరుపుతున్నారీ పుకార్లు వచ్చిన నేపథ్యంలో రైతు సంఘాల నేతలు మరోసారి స్పష్టతనిచ్చారు. తమ మధ్య ఎలాంటి విభేదాలూ లేవని, అందరం ఐకమత్యంతోనే ఉద్యమం చేస్తున్నామని రైతు సంఘం నేత శివకుమార్ స్పష్టం చేశారు. మా నిర్ణయాలన్నీ ఏకగ్రీవమే. చర్చల్లో, మెజారిటీయో కాదు. కొందరు అంగీకరించడం, కొందరు తిరస్కరించడం అనేది కాదు. చట్టాలను రద్దు చేయాలని అన్ని యూనియన్లు ప్రకటిస్తే... అది అందరి డిమాండ్లు అన్నట్లే. అందులో వ్యక్తిగత అభిప్రాయాలకు తావేలేదు. జరిగిన ఐదు మీటింగ్‌లూ హడావుడిగానే జరిగాయి. అవునో, కాదో చెప్పండి అనే అడిగారు. మేము అందరమూ ఐకమత్యంతోనే ఉన్నామని శివకుమార్ తెలిపారు.

# ఇది ఒక అద్భుతమైన ప్రాజెక్టు: రతన్ టాటా

న్యూఢిల్లీ, డిసెంబర్10: ఢిల్లీలో నిర్మించనున్న నూతన పార్లమెంట్ భవనం ఒక అద్భుతమైన ప్రాజెక్టు అని టాటా ట్రస్టుల ఛైర్మన్ రతన్ టాటా పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు విజయవంతంగా పూర్తి కావాలని కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు. చరిత్రలో నిలిచిపోనున్న ఈ ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమానికి తనను ఆహ్వానించడం ఎంతో సంతోషంగా ఉందని రతన్ టాటా చెప్పారు. ఇవాళ ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా జరిగిన నూతన పార్లమెంట్ బిల్డింగ్ శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన రతన్ టాటా.. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడారు.

# పిసిసి చీఫ్ పదవికి రేవంత్ పేరు ఖరారయ్యిందా?

## పార్టీలో ఆయన నాయకత్వాన్ని వ్యతిరేకిస్తున్నారా
## ఇత రనేతలను ఒప్పించే యత్నంలో అధిష్టానం

హైదరాబాద్,డిసెంబర్9(ఆర్ఎన్ఎ): తెలంగాణలో టీపీసీసీ చీఫ్ ఎంపికపై కసరత్తు మొదలయ్యింది. పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మాణికం ఠాగూర్ ప్రకటనతో కాంగ్రెస్ పార్టీలో ఊపు వచ్చింది. టీపీసీసీ పదవి ఎంపీ రేవంత్ రెడ్డికే అని స్పష్టత వచ్చినా.. ఇంకా సంప్రదింపులు, కసరత్తు అంటూ సాగదీస్తున్నారు. రేవంత్‌ను వ్యతిరేకించే వర్గం ఆపడానికి అన్నిరకాల ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఎందుకంటే ఒకసారి రేవంత్ రెడ్డి చీఫ్ అయ్యారంటే వార్ వన్ సైడే అన్న విషయం వారికి తెలుసు.

అది వైఎస్ టైమ్‌లో మాత్రమే నడిచింది. మళ్లీ అలాంటి పరిస్థితి వస్తుందనే అంచనాలు వాళ్లకున్నాయి. వారి మాట చెల్లకుండా పోతుందని, పరపతి తగ్గిపోతుందనే భయంతో రేవంత్‌ను అడ్డుకునే పనిలో ఉన్నారు. కాంగ్రెస్ అధిష్టానం సయితం రేవంత్ అందరినీ కలుపుకుపోలేరేమో అనే అనుమానాల్లో ఉందనే సమాచారం. ఏమైనా ప్రత్యామ్నాయం అయితే వేరే ఎవరూ లేరనే వాదన వినిపిస్తోంది. అసలే బీజేపీ ఉపులో ఉంది.

కాంగ్రెస్‌లోని ముఖ్యమైన నాయకులకు వలవేస్తోంది. ఇప్పుడు టీపీసీసీ ఎవరు పేరు ప్రకటించినా.. అసంతృప్తిగా ఉండేవాళ్లు బీజేపీలోకి జంప్ చేసే ఛాన్స్ ఉంది. అందుకే అందరినీ ఒప్పించే పేరు ప్రకటించే వ్యూహంలో కాంగ్రెస్ అధిష్టానం ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలావుంటే తెలంగాణ కొత్త పీసీసీ అధ్యక్షుని ఎంపిక కోసం బుధవారం నుంచే సంప్రదింపుల పక్రియ మొదలవుతోందని కాంగ్రెస్ సీనియర్ నేత మదుయాష్కీ చెప్పారు.

ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇప్పటి వరకు ఎలాంటి కసరత్తు జరగలేదని, ఎవరి పేర్లు ÷నైల్ కాలేదన్నారు. ఇప్పటి వరకు జరిగిందంతా వట్టి ప్రచారం మాత్రమేనన్నారు. ఆ ప్రచారాన్ని చెక్ పెట్టడానికే రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జ్ మానిక్ ఠాగూర్ రంగంలోకి దిగుతున్నారన్నారు. డిసెంబర్ నెలాఖరుకు కొత్త అధ్యక్షుని నియామకం పూర్తవుతుందని చెప్పారు. ఇదిలావుంటే పీసీసీ చీఫ్‌కు కాంగ్రెస్‌లో చాలామంది సమర్థులున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. తాను కూడా పీసీసీ చీఫ్ రేసులో ఉన్నానని తెలిపారు. సీనియర్లు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఓడిన వారి అభిప్రాయాలు కూడా తీసుకోవాలని ఆయన సూచించారు. సమన్వయంతో పనిచేసే నాయకుడికి అవకాశం ఇవ్వాలన్నారు

# మోటార్ వాహనాల చేధనలో ఆశించిన ఫలితాలు

## –కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి



కరీంనగర్. డిసెంబర్ 10 (నేటినిజం ప్రతినిధి):దొంగిలించబడిన మోటార్ వాహనాలకు సంబంధించిన కేసుల చేధనలో ఆశించిన స్థాయిలో ఫలితాలు వస్తున్నాయని కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి అన్నారు. రాత్రి,పగలు జరిగే కన్నపునేరాలతోపాటు దోపిడి,దొంగతనాల చేధనపై కూడా పోలీసులు దృష్టి సారించాలని ఆదేశించారు.

మోటార్ వాహనాల దొంగతనాలకు సంబంధించిన కేసులు వెంటనే నమోదు చేయాలని చెప్పారు. క్రైంబృందాలకు చెందిన పోలీసులను నేరాల చేధనకోసమే కేటాయించాలని, ఇతర కారణాలు చూపుతూ అదనపు విధులను అప్పగించకూడదని పేర్కొన్నారు. మహిళల మెడల్లోని పుస్తులతాళ్ళు, ఇతర రకాల ఆభరణాలను దొంగిలించబడిన కేసులను చేధించడం ఛాలెంజ్‌గా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సంవత్సరంలో 80శాతం నేరాలను చేధించడం లక్ష్యంగా పనిచేయాలని చెప్పారు. సిసి కెమెరాల మరమ్మత్తుల కోసం ఇచ్చిన 10రోజుల సమయాన్ని గడువులోపు మరమ్మత్తులు పూర్తిచేయాలని చెప్పారు. ప్రతి గ్రామంలో సిసి కెమెరాలు ఏర్పాటయ్యే విధంగా అన్నివర్గాల ప్రజలను భాగస్వాములను చేయాలని తెలిపారు. సిసి కెమెరాల ఫుటేజీల ద్వారా చేధించబడిన కేసులు, నేరాల నియంత్రణ, చేధనలో సిసి కెమెరాల ప్రాధాన్యాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. సిసి కెమెరాలు ఇస్తున్న ఫలితాలపై ఒక అవగాహనకు వచ్చి ప్రజలు స్వచ్ఛందంగా ముందుకువస్తారని చెప్పారు.

**జాతీయ రహదారులపై వాహనాల నెంబర్‌పేట్లు స్పష్టంగా కనపడేలా ప్రత్యేక కెమెరాల ఏర్పాటు**

జాతీయ,రాష్ట్ర రహదారుల్లో ఎక్కువశాతం ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో వాహనాలకు సంబంధించిన నెంబర్‌పేట్లు స్పష్టంగా కనిపించేలా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అందుబాటులోకి వచ్చిన ప్రత్యేక కెమెరాలను ఏర్పాటు చేయాలని పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి కమిషనరేట్‌లోని పోలీస్ అధికారులను ఆదేశించారు. జాతీయ, రాష్ట్ర రహదారుల్లో వాహనదారులు అతివేగంగా, నిర్లక్ష్యంగా వెళుతున్నారని, ఇలాంటి కారణాలతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. రహదారులపై వాహనాల వేగాన్ని నియంత్రించడం కోసం స్పీడ్‌గన్‌ల ద్వారా ఈ–చలాన్లు విధించాలని ఆదేశించారు. పైన పేర్కొన్న రహదారుల్లో వేగం నియంత్రణ, ప్రమాదం జరిగేందుకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో సూచికలను ఏర్పాటు చేయాలని సూచించారు.

**ట్రైనీ ఐపిఎస్ అధికారిణి రష్మీ పెరుమాళ్ సేవలు అభినందనీయం**

ప్రస్తుతం ఎల్‌యండి పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ గా పనిచేస్తున్న ట్రైనీ ఐపిఎస్ అధికారిణి రష్మీ పెరుమాళ్ సిసి కెమెరాల ఏర్పాటులో అన్నివర్గాల ప్రజలను భాగస్వాములను చేస్తూ నూతన కెమెరాలు ఏర్పాటు చేయించడం, సాంకేతిక కారణాలతో పనిచేయని కెమెరాలకు మరమ్మత్తులు చేయించడంతోపాటు వివిధ విభాగాల పనితీరులో ఆశించిన స్థాయిలో రాణిస్తూ సదరు అధికారిణి అందిస్తున్న సేవలు అభినందనీయమని పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి అన్నారు. కమిషనరేట్‌లోని ఇతర అధికారులు సదరు అధికారిణి ఆదర్శంగా తీసుకుని పనిచేయాలని పిలుపునిచ్చారు.

**ప్రైవేటు వాహనాలు క్యూఆర్‌కోడ్ వినియోగించాలి**

ప్రయాణీకులను గమ్యస్థానాలకు చేరవేసేందుకు రోడ్లపై నడుస్తున్న ప్రైవేట్ వాహనాలు క్యూఆర్‌కోడ్ వినియోగించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. క్యూఆర్‌కోడ్ వినియోగించని వాహనాలకు ఈ–చలాన్లు విధించాలని తెలిపారు. క్యూఆర్‌కోడ్ ఉన్న వాహనాల్లో ప్రయాణించడం ద్వారా కలిగే ప్రయోజనాలపై అన్నివర్గాల ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు.

**రాంగ్‌రూట్‌లో వెళుతున్న వాహనాలను నియంత్రించాలి**

రాంగ్‌రూట్‌లో వెళుతున్న వాహనాలను నియంత్రించాలని పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి ట్రాఫిక్ పోలీస్ అధికారులను ఆదేశించారు.

రాంగ్‌రూట్‌లో వెళుతున్న వాహనాల ద్వారానే ప్రమాదాల సంఖ్య పెరుగుతున్నదని చెప్పారు. రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని వివిధ రకాల వ్యాపారాలను నిర్వహించే వారిని ఇతర ప్రాంతాలకు తరలించాలని సూచించారు. రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని వాహన, పాదాచారులకు ఇబ్బందులు కలుగజేసే వారిపై ఈ–పెట్టీ కేసులను నమోదు చేయాలని చెప్పారు.

**లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం కావాలి**

ఈనెల 12న జరుగనున్న లోక్ అదాలత్‌లో ఎక్కువసంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా పెండింగ్ కేసుల సంఖ్య తగ్గుతుందని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా ఎక్కువ కేసులను పరిష్కరించే పోలీస్‌స్టేషన్లకు ప్రథమ, ద్వితీయ, తృతీయ రివార్డులను అందజేస్తామని ప్రకటించారు.

**నిందితులకు శిక్షలు పడేలా పగడ్బందీ చర్యలు తీసుకోవాలి**

వివిధ రకాల కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి ఆదేశించారు.

నిందితులు శిక్షింపబడటం ద్వారా నేరాలు నియంత్రణలోకి వస్తాయనే విషయాన్ని గుర్తించాలని చెప్పారు. వివిధ రకాల కారణాలతో పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించేందుకు పోలీస్‌స్టేషన్లు, సర్కిల్, డివిజన్‌స్థాయిల్లో కేసుల పురోగతిపై సమీక్షలు నిర్వహించాలని తెలిపారు. సమీక్షలు నిర్వహించడం ద్వారా సదరు కేసుల దర్యాప్తుల్లో నాణ్యత ప్రమాణాలు పెంపొంది పరిష్కారానికి దోహదపడుతాయని పేర్కొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసిన ఎంపీటీసీ గాలిపెల్లి సువర్ణస్వామి గౌడ్



రాజన్న సిరిసిల్లా, డిసెంబర్ 10 (నేటినిజం ప్రతినిధి):వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం గ్రామంలోని పార్వతి కావేరీ కి వైద్య ఖర్చుల ఖర్చుల నిమిత్తంమంజూరు అయిన సీఎం రిలీఫ్ ఫండ్ రూ. 28000వేలచెక్కును గురువారం రుద్రవరం ఎంపీటీసీ గాలిపెల్లి సువర్ణ స్వామిగౌడ్ అందజేశారు . ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు తునికినర్సయ్య, అతికం పావని కనకయ్య ,సింగిల్ విండో డైరెక్టర్ ,గోనె భాస్కర్,విద్యా కమిటీ చైర్మన్ గాలిపల్లి శ్రీధర్ గౌడ్ ,నాయకులు పార్వతి వేణు గౌడ్, గాలిపెల్లి సతీష్, పార్వతి తిరుపతి, తునికి శ్రీనివాస్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

# పిసిసి అధ్యక్షుడిగా తనకు అర్హతలు ఉన్నాయన్న కోమటిరెడ్డి

### తానూ పోటీలో ఉన్నానని అంటున్న జగ్గారెడ్డి

హైదరాబాద్,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): పీసీసీ అధ్యక్షుడి ఎంపికపై కసరత్తు ముమ్మరంగా సాగుతోంది. తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షపదవికి ఎంపిక జరుగుతున్న వేళ ఎవరికి వారే తమకే పీఠం దక్కుతుందని ప్రచారం చేసుకుంటున్నారు. తాజాగా టీపీసీసీ అధ్యక్ష పదవి తనదేనంటూ భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పీసీసీ అధ్యక్షుడికి కావాల్సిన అన్ని అర్హతలు తనకు ఉన్నాయన్నారు. పీసీసీ అధ్యక్ష పదవి ఎవరికి వస్తుందో నాలుగు రోజుల్లో ప్రజలే చూస్తారని చెప్పారు. అధ్యక్షుడి నియామకం విషయంలో అధిష్టానం నిర్ణయమే అంతమమని అన్నారు. పీసీసీ అధ్యక్ష పదవి రాకపోయినా తాను మాత్రం బీజేపీలో చేరేది లేదని మరోసారి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. తనది కాంగ్రెస్ రక్తమని, పార్టీలు మారే సంస్కృతి తనది కాదని చెప్పారు.తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన తాను.. పీసీసీ అధ్యక్ష పదవి ఇస్తే వైఎస్సార్ మాదిరి గ్రామగ్రామాన పాదయాత్ర చేసి కాంగ్రెస్‌ను గెలిపిస్తానని చెప్పారు. కేటీఆర్‌తో పాటు ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ కూడా ముఖ్యమంత్రి కావాలని అనుకుంటున్నాడని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏఐసీసీ సభ్యులు, మాజీ మంత్రులు, కేంద్ర మాజీ మంత్రులతో కాంగ్రెస్ ఇంచార్జ్ మనిక్కం ఠాగూర్ వన్ టు వన్ భేటీ నిర్వహించారు. ఠాగూర్‌తో భేటీ అనంతరం కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి మాట్లాడుతూ పీసీసీ అధ్యక్ష పదవి తనకు ఇవ్వాలని ఠాగూర్‌ను కోరినట్లు తెలిపారు. పీసీసీ కోసం కాంగ్రెస్ గ్రూపులుగా విడిపోయిన మాట వాస్తవమన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో వాతావరణం బాగాలేదని.. ఎమ్మెల్యే, ఎంపీలుగా గెలిచే నాయకుల అభిప్రాయం మేరకే పీసీసీ అధ్యక్షుడి ఎంపిన జరగాలని చెప్పారు. వీహెచ్, మర్రి శశిధర్ రెడ్డి, కోదండరెడ్డి లాంటి నాయకుల అభిప్రాయాలకు విలువ ఇవ్వాలని అన్నారు. మూడు సార్లు ఓడిపోయిన నాయకుల అభిప్రాయాలు అవసరంలేదని చెప్పుకొచ్చారు. అందర్నీ సమన్వయం చేయకుండా పీసీసీ ప్రెసిడెంట్‌ను ఎంపిక చేస్తే కాంగ్రెస్‌కు ఇబ్బందులు తప్పవని స్పష్టం చేశారు. సోషల్ మీడియాను వాడుకోవటంలో తాము వెనుకబడిన మాట వాస్తవమే అని ఎమ్మెల్యే జగ్గారెడ్డి అంగకీరించారు

# ఆర్టీసీ పార్సిల్ సర్వీసులకు జనాదరణ

### ఇప్పటికే 15లక్షలకు పైగా ఆదాయం
### మరింత పెరుగుతుందన్న మంత్రి పువ్వాడ

హైదరాబాద్,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): గత 3 నెలలుగా కొరియర్ పార్సిల్‌లో ఆర్టీసీ వేగవంతమైన వృద్ధి సాధించిందని రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ చెప్పారు. ఇప్పటికి 15 లక్షలకు పైగా సరుకు రవాణా చేసాం..రోజుకు రూ.15 లక్షల ఆదాయం వస్తుందన్నారు. త్వరలో ఈ ఆదాయం రూ.20 లక్షలకు చేరుకుంటుందన్నారు. కూకట్‌పల్లి ,ఎంజిబిఎస్ జెబిఎస్ ప్రాంతాల నుంచి మూడు ఏజెన్సీలకు హోమ్ డెలివరీ'కి ఇచ్చామని పేర్కొన్నారు. ఇప్పుడు ఒక ప్రాంతం నుంచి వచ్చిన వారికి నేరుగా ఇంటికే సర్వీసులు అందిస్తున్నామని తెలిపారు. ఇప్పుడిప్పుడే ప్రయాణికుల నుంచి ఆదరణ లభిస్తుందన్నారు. రాష్ట్రం ప్రధాన ఆదాయం కోల్పోయిన బడ్జెట్ సమయంలో ఇచ్చిన రూ.1000 కోట్లకు అదనంగా 200 కోట్లు ఇచ్చారని చెప్పారు. ఇప్పటికే రూ.800 కోట్లు పైన రాష్ట్ర ఖజానా నుంచి ఆర్టీసికి చేరిందని పేర్కొన్నారు.

కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కూడా పార్సిల్ సర్వీసులు కూడా వేగవంతం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉద్యోగులు 2-3రోజులు జీతాలు ఆలస్యం అవుతున్నందుకు ఆందోళన అవసరం లేదన్నారు. మహారాష్ట్ర ఆర్టీసీలో 5 నెలలుగా, కర్నాటకలో 3 నెలలుగా ఉద్యోగులకు జీతాలు లేని పరిస్థితి ఉందన్నారు. సీసీఎస్‌కు రూ.230 కోట్లు అదనంగా జమ చేశామని చెప్పారు. ఇంకా రూ.600 కోట్లు ఇవ్వాల్సి ఉందన్నారు. ఆర్టీసి వెల్ఫేర్ కమిటీలు సక్రమంగా పని చేస్తున్నాయని కొనియాడారు. ఆర్టీసీ ఉద్యోగులకు ఎలాంటి వేధింపులు లేవన్నారు. డబుల్ డెక్కర్ బస్సులపై మంత్రి కేటీఆర్ సూచించారని, కొన్ని ఏరియాలపై బస్సులు నడిపించడం కోసం తయారు చెపిస్తామన్నారు. 40-50 బస్సులు రాబోతున్నాయన్నారు. సిటీలో 50 శాతం బస్సులు నడుస్తున్నాయని తెలిపారు. త్వరలోనే బస్సులు పెంచుతామని చెప్పారు. ప్రస్తుతం 1750 బస్సులు గ్రేటర్ పరిధిలో నడుస్తున్నాయని పేర్కొన్నారు.

# రైతులకు సేవతో మంచి పేరు తీసుకుని రావాలి

### పాలకవర్గం ప్రమాణస్వీకారోత్సవంలో మంత్రి శ్రీనివాసగౌడ్

మహబూబ్‌నగర్,డిసెంబర్10 (ఆర్ఎన్ఎ): పదవులు మనకు వన్నె తేవని...



మన పనితీరుతో పదవికే వన్నె తీసుకు రావాలని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. రైతులకు నూతన పాలకవర్గం సరైన న్యాయం చేయాలని కోరారు. మహబూబ్ నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అమరేందర్ రాజు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రైతు సంక్షేమం కోసం కృషి చేయాలని..నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు లేకుండా చూసేందుకు పాలకవర్గం కృషి చేయాలని మంత్రి కోరారు. వ్యవసాయానికి పెద్ద పీట వేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కేంద్రం మాత్రం నూతన వ్యవసాయ చట్టం తెచ్చి మార్కెట్లను ఎత్తి వేసేందుకు కుట్ర పన్నిందని తెలిపారు. కార్పొరేట్ల వల్ల రైతులు కుదేలయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రధాని మోదీ రైతుకు అన్యాయం చేసే చట్టాన్ని వెనక్కు తీసుకోవాలని మంత్రి డిమాండ్ చేశారు. కార్యక్రమంలోఎంపీ మన్నే శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఢిల్లీ పర్యటనకు సిఎం కెసిఆర్

### రైతు సంఘాల నేతలను కలిసే అవకాశం
### ప్రధాని, కేంద్రమంత్రులతో భేటీ
### పార్టీ కార్యాలయానికి శంకుస్థాపన చేసే ఛాన్స్

హైదరాబాద్,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ శుక్రవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. హస్తిన పర్యటనలో భాగంగా ఆయన మూడు రోజుల పాటు ఢిల్లీలోనే మకాం వేయనున్నారు. ఈ పర్యటనలో పలువురు కేంద్ర మంత్రులతో పాటు విపక్ష నేతలను కలవనున్నారు. నూతన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో రైతులు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా రైతు సంఘాల నేతలతో సమావేశమయ్యే అవకాశం కూడా ఉంది. ఢిల్లీలో పార్టీ ఆఫీస్ కోసం కేంద్రం కేటాయించిన స్థలాన్ని కూడా కేసీఆర్ పరిశీలించనున్నారు. వీలయితే శంకుస్థాపన కూడా చేస్తారు. ఒకవైపు హస్తినలో రైతులు చేస్తున్న ఆందోళనకు మద్దతిస్తూనే పలువురు కేంద్ర మంత్రులను కేసీఆర్ కలవనుండడం ఆసక్తికరంగా మారనుంది.

కరోనా తరువాత కేసీఆర్ మొదటిసారిగా ఢిల్లీ వెళ్తున్నారు. ఢిల్లీలో ప్రధానితో సహా అనేకశాఖల మంత్రులను కేసీఆర్ కలవబోతున్నారు. జీహెచ్ఎంసి ఎన్నికల్లో టిఆర్ఎస్ విజయాన్ని బీజేపీ అడ్డుకుంది. ఎన్నికల సమయంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రధాని మోడీపై విరుచుకుపడ్డారు. బీజేపీకి చెందిన ఢిల్లీ స్థాయినేతలు, మంత్రులు జీహెచ్ఎంసి ఎన్నికల సమయంలో ప్రచారం నిర్వహించారు. కేసీఆర్ పై విమర్శలు చేశారు. ఎల్బీ స్టేడియంలో జరిగిన బహిరంగ సభలో కేసీఆర్ బీజేపీని, ప్రధాని మోడీని విమర్శించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కేసీఆర్ ఢిల్లీ పర్యటన ఆసక్తికరంగా మారింది. శనివారం టిఆర్ఎస్ పార్టీ కార్యాలయానికి పూజ చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

# మన ఊరికి మన గురుకుల కార్యక్రమానికి స్పందన




రాజన్న సిరిసిల్లా, డిసెంబర్ 10 (నేటినిజం ప్రతినిధి): మన ఊరికి మన గురుకులం అనే కార్యక్రమనికి విశేష స్పందన లభించింది, ఈ కార్యక్రమంలో భాగంగా బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కు చెందిన ప్రధానాచార్యులు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు కలిసి వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని శాత్రాజుపల్లి జిల్లా పరిషత్ పాఠశాల యందు చుట్టుపక్కల గ్రామాల నుండి 40 మంది విద్యార్థులను సమీకరించి కోవిడ్19 నిబంధనలు పాటిస్తూ విద్యార్థులకు ఇంతవరకు వరకు నిర్వహించిన ఆన్లైన్ తరగతులు, షార్ట్ వీడియో పాఠాలని ఎంతవరకు అవగతం చేసుకున్నారని ప్రత్యక్షంగా ప్రతి సబ్జెక్టు టీచర్ వ్యక్తిగతంగా అడిగి తెలుసుకొని వారి సందేహాలను నివృత్తి చేయడం జరిగింది.పదవ తరగతి మరియు ఇంటర్ తర్వాత ఉన్నత విద్యను అభ్యసించడం లో గల అవకాశాలను వివరించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో గురుకుల ప్రధానోపాధ్యాయురాలు పద్మ, వైస్ ప్రిన్సిపాల్ అశ్విని ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, న్యాయవాది గుడిసె సదానందం జిల్లా స్వేరో డి జి పి ఏ నాయకులు, ప్రధానోపాధ్యాయులు మురలీకృష్ణ. ఉపాధ్యాయులు ఉమా రాణి, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు .

**IN THE COURT OF THE**
**HON'BLE XII ADDL. CHIEF JUDGE**
**CITY CIVIL COURT AT**
**SECUNDERABAD**
**M.V.O.P. NO. 448 OF 2017**

Between:

**Sri. Nallaralla Goverdhan Reddy**
.....Petitioner

**And**

**Sri. Karengula Sampath & others**
..... Respondents

R-1 Sri. Karengula Sampath
S/o. Yadagiri, Age: 30 years
Occ: Driver
R/o. H.No. 1-97/8, Kolanupaka Village
Alair (Mandal), Jangaon (Dist), T.S.

Please take notice that the above named petitioner filed the above case, claiming compensation for the death of Nallaralla Padma in the accident that occurred on 13-8-2017 due to the rash and negligent driving of driver of the crime vehicle motor car B.No. TS-05-UA-818 against you. You are here by summoned to appear before this Hon'ble Court in person or through your counsel on **22-12-2020** at 10:30 A.M. and the case is posted for your appearance and counter on said date, failing which, matter will be decided against you as per law

(BY ORDER OF THE Honble COURT)

**K. AMARENDER REDDY**
**V. RAMREDDY**
**J. RAMESH**
Advocates.
Barkathpura,
Hyderabad-44
Cell: 9948299090

# బిజెపి అధికారంలోకి వస్తే ప్రాజెక్టులు పూర్తి చేస్తాం: సోము వీర్రాజు

కడప,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): 2024లో బీజేపీ అధికారంలోకి వస్తే.. ఏపీలోని అన్ని ప్రాజెక్ట్‌ల్ని పూర్తి చేస్తామని ఆ పార్టీ అధ్యక్షుడు సోము వీర్రాజు స్పష్టం చేశారు. రూ. 40 వేల కోట్లతో ప్రాజెక్టులు నిర్మిస్తామని సీఎం జగన్ చెప్తున్నారని, ప్రాజెక్టులకు అన్ని వేల కోట్లు అవసరం లేదని తోసిపుచ్చారు. రూ.1,800 కోట్లతో కేంద్రం అమరావతిలో ఎయిమ్స్ ఆస్పత్రి నిర్మించిందని తెలిపారు. రూ.7,200 కోట్లతో టీడీపీ అధినేత చంద్రబాబు ఎందుకు అమరావతి నిర్మించలేక పోయారు? అని సోము వీర్రాజు ప్రశ్నించారు. గురువారం జిల్లాలో సోము వీర్రాజు పర్యటించారు. ఉదయం 9 గంటలకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల కార్యకర్తలతో స్థానిక కడప - రాయచోటి రోడ్డులోని ఎంకే కల్యాణ మండపంలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లాలోని బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పర్వతాలు ప్రకృతికి, జీవకోటికి ఆభరణాలు

**(11 డిసెంబరు 'అంతర్జాతీయ పర్వతాల దినం' సందర్భంగా)**

శిలలు మరియు భూమి సమ్మిళిత అతి ఎత్తైన భూభాగాలను పర్వతాలుగా గుర్తిస్తారు. ప్రపంచ జీవ జనాభా 15 శాతం, అనగా ఒక బిలియన్ ప్రజలు పర్వత ప్రాంతాలలో నివసించడం, దాదాపు 50 శాతం జీవవైవిధ్య పోషణ హాట్‌స్పాట్ కేంద్రాలుగా పర్వతాలు పని చేయడంతో పాటు మానవాళి హితానికి మరియు పర్యావరణ హరితానికి ఎంతగానో సేవలను ప్రకృతి సహజ పర్వతగిరులు అందిస్తున్నాయి. పర్వత కేంద్రాలు 33 శాతం వృక్షజాలానికి పుట్టుకను ఇస్తున్నాయి. దాదాపు 20 శాతం ప్రపంచ పర్యాటకులను ఆకర్షించుటలో మరియు 28 శాతం అడవులకు ఆవాసాలుగా పర్వత ప్రాంతాలు సఫలం అవుతున్నాయి. మానవాళికి సంబంధించిన 80 శాతం ఆహార పదార్థాల్లోకి 20 పంటల్లో 6 పంటలు (మె?క్కజొన్న, ఆలు, బార్లీ, సోర్గమ్, టమాట మరియు ఆపిల్) పర్వతాలు అందించినవే. సగం విశ్వ మానవాళికి నిత్యం తాగు నీరు అందిస్తున్న పర్వతాలను రక్షించుకోవలసిన అత్యవసర స్థితిలో మనం ఉన్నాం. దురదృష్టవశాత్తు స్వార్థ మానవుడి అతి దోపిడీ మరియు పర్యావరణ ప్రతికూలతల వల్ల పర్వతాల ఉనికి ప్రశ్నార్థకం అవుతున్నది. భూతాపంతో మంచు కొండలు కరిగి, తరిగి పోతూ, వాతావరణంలో తీవ్ర మార్పులతో పర్వత ప్రాంత మిలియన్ల పేద ప్రజల బతుకులు ప్రమాదంలోకి నెట్టబడుతున్నాయి. పరిస్థితిని గమనించి తక్షణమే కార్బన్ ఉద్గారాలను తగ్గించాల్సిన అగత్యం ఏర్పడుతున్నది. పర్వతాల పరిరక్షణ అవసరాన్ని గుర్తించిన ఐరాస 2002ను 'ఐరాస అంతర్జాతీయ పర్వతాల సంవత్సరం' కూడా నిర్వహించడం జరిగింది. దాదాపు 70 శాతం పర్వత భూములు జంతువుల మేతకు ఆధార భూతాలుగా, జీవవైవిధ్య హితాలుగా మరియు నేల సారాన్ని పెంచేవిగా మానవాళికి సహకరిస్తున్నాయి. పర్వత క్షేత్రాల్లోని జంతువులు పాలు, మాంసం, తోలు, ఉన్ని, నూలు, కొమ్ములు, దంతాలు, ఎరువు లాంటి అమూల్య ఉత్పత్తులకు కారణం అవుతున్నాయి. పర్వతాల నుండి కూరగాయలు, ధాన్యాలు, దుంపలు, గింజలు, నట్స్, చేపలు, తేనె, క్రిమికీటకాలు, గమ్స్, రెజిన్లు, ఔషధాలు మరియు ఫంగీ లాంటి సంపదలు కూడా అందుతున్నాయి. అశాస్త్రీయ సాగు, పోడు వ్యవసాయం, మైనింగ్ వ్యాపారం, అక్రమ వేట, అక్రమ కలప వంటి చర్యల వల్ల పర్వతాల జీవవైవిధ్యం దెబ్బతినటం, పర్వత పుత్రుల సాంస్కృతిక సంపద తరిగి పోవడం, గిరిజనుల జీవనానికి ప్రతికూలతలు మరియు పర్వతాల ఉనికికి అవరోధాలుగా పని చేస్తున్నాయి.

విశ్వ మానవాళికి పర్వతాలు చేస్తున్న సేవలను గుర్తించిన ఐరాసకి చెందిన 'ఆహార మరియు వ్యవసాయ సంస్థ (ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్)' నేతృత్వంలో 2003 నుంచి ప్రతియేటా 11 డిసెంబర్ రోజున 'అంతర్జాతీయ పర్వతాల దినం' పాటిస్తూ, వాటి పరిరక్షణ అవసరం, ఉపయోగాలు మరియు జీవ వైవిధ్య రక్షణలను సామాన్య జనులకు అవగాహన పరిచేందుకు కృషి చేయుట జరుగుతున్నది. అంతర్జాతీయ పర్వతాల దినం - 2020 నినాదంగా 'పర్వతాల జీవ వైవిధ్యం' తీసుకోబడింది. ఐరాస నిర్ణయం ప్రకారం 2021 - 2030 దశాబ్దాన్ని ' ఐరాస పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణ దశాబ్దం'గా తీసుకోవడం కూడా జరిగిందని గమనించాలి. పర్వతాల అవసరానికి సంబంధించిన అంశాలను అవగాహన పరిచేందుకు విద్యాలయాల్లో పలు రకాలైన పోటీలు, ప్రదర్శనలు, ర్యాలీలు, ప్రతిజ్ఞలు, ఉపన్యాసాలు, కార్యశాలలు, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం లాంటివి ఏర్పాటు చేయాలి. నీరు, ఆహారం మరియు శక్తి కేంద్రాలైన పర్వతాలు మానవాళికి అపార సేవలను చేస్తున్నాయి. అత్యధిక పర్వత ప్రాంత జనాభా కలిగిన పర్వతాలుగా యూరప్‌లో విస్తరించి ఉన్న అల్ప్స్ పర్వతశ్రేణులు వస్తాయి. పర్వతాల్లో ఫోల్డ్, ఫాల్ట్-బ్లాక్, డోమ్, వాల్కనో, ప్లాటీవ్ అనబడే రకాలు ఉంటాయి. ప్రపంచంలోని ముఖ్య పర్వతాల్లో మన హిమాలయాలు (ఏసియా), అల్ప్స్ (యూరప్), అండెస్ (అమెరికా), రాఖీక్ (అమెరికా-కెనడా), కరకోరమ్ (ఏసియా) వస్తాయి. పర్వతాల పరిరక్షణతో 'గ్రీన్ ఎకానమీ (ఆర్థిక హరితం)' సిద్ధిస్తూనే, కాలుష్యం తగ్గించబడుతుంది. విశ్వ మానవాళికి పలు రకాలుగా సేవలు అందిస్తున్న పర్వతాలను పరిక్షించుటలో మనందరం సేవకులు అవుదాం, పర్యావరణాన్ని మరియు జీవ వైవిధ్యాన్ని కాపాడుకుందాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# సిద్దిపేట పట్టణానికి మహర్దశ

### అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి సిఎం కెసిఆర్ శంకుస్థాపన
### అమృత్ పథకంలో భాగంగా రూ.278 కోట్లతో నిర్మాణం
### రంగనాయకసాగర్ గెస్ట్ హౌజ్‌కు కూడా ప్రారంభోత్సవం

సిద్దిపేట,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): స్వచ్ఛతలో ఇప్పటికే జాతీయ స్థాయిలో అవార్డులను సాధించిన సిద్దిపేట పట్టణం మరో ఘనతను సాధించింది. రాష్ట్రంలోనే మురుగుశుద్ధి కేంద్రం ఉన్న రెండో మున్సిపాలిటీ సిద్దిపేటగా ఖ్యాతి కెక్కింది. తడి,పొడి చెత్తను వేరు చేస్తూ వడివడిగా అడుగులు ముందుకు వేస్తూ 'శుద్ధి'పేటగా పేరు తెచ్చుకుంది. సిద్దిపేట పట్టణాన్ని ఆరోగ్యకరమైన పరిశుభ్రమైన పట్టణంగా మార్చేందుకు చేపట్టిన పథకం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టారు. జిల్లా పర్యటనలో ఉన్న సీఎం కేసీఆర్ సిద్దిపేట పట్టణంలోని చింతల్‌చెరువు దగ్గర అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ప్రారంభించారు. అమృత్ పథకంలో భాగంగా రూ.278 కోట్లతో సిద్దిపేట పట్టణంలో 328.4 కి.మీ మేర భూగర్భ మురికి కాలువల నిర్మాణానికి గాను 302 కి.మీ. మేర పూర్తి చేశారు. జనావాసాల నుంచి వచ్చే మురుగు నీటిని శుద్ధి చేసి ఆ నీటిని విడుదల చేసే ప్రక్రియలో భాగంగా నిర్మించిన కేంద్రం ఎస్‌టీపీ ట్యాంకు. సిద్దిపేట మున్సిపాలిటీలో 34 వార్డులు ఉన్నాయి. 25,517 గృహాలు ఉన్నాయి. ఇంటింటికీ కనెక్షన్లు ఇచ్చారు. మొదటి దశలో 8వేల ఇండ్లకు అనుసంధానం చేశారు. ప్రస్తుతం ప్రతి రోజు మొదటి ప్యాకేజీలో భాగంగా చింతల్ చెరువు వద్ద 7.25 ఎంఎల్‌డీ సామర్థ్యంతో నిర్మించిన ఎస్‌టీపీ ట్యాంకులోకి మురుగు నీరు ప్రవహిస్తుంది. అక్కడి శుద్ధి చేసిన నీరు పక్కనే ఉన్న చెరువులోకి విడుదల చేస్తారు. అలాగే రంగనాయకసాగర్ గెస్ట్‌హౌజ్‌ను సీఎం కేసీఆర్ ప్రారంభించారు. సిద్దిపేట శివారులోని చిన్నకోడూరు మండలం చంద్లాపూర్, పెద్దకోడూరు గ్రామల సమీపంలో కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా రంగనాయక సాగర్ రిజర్వాయర్‌ను 3 టీఎంసీల సామర్థ్యంతో ప్రభుత్వం నిర్మించింది. ఈ రిజర్వాయర్ మధ్యలో 45 ఎకరాల విస్తీర్ణంలో పల్లగుట్ట ఉంటుంది. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా పల్లగుట్టపై రంగనాయక సాగర్ అతిథి గృహాన్ని సుమారుగా రూ.7 కోట్లతో నిర్మించారు. దీని వెనుక భాగంలో కాళేశ్వరం ప్రాజెక్టు ఎస్‌ఈ కార్యాలయం ఉంది. రంగనాయక సాగర్ మధ్యలో ఉన్న పల్లగుట్ట సుమారు 45 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా, ఈ అతిథి గృహాన్ని సుమారు ఎకరం విస్తీర్ణంలో నిర్మించారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో వేయిటింగ్‌హాల్, డైనింగ్‌హాల్‌తో పాటు ఆఫీస్ గది ఉంది. మొదటి అంతస్తులో కాన్ఫరెన్స్‌హాల్, వేయిటింగ్‌హాల్ ఏర్పాటు చేశారు. పై అంతస్తులో వీవీఐపీ సూట్ ఒకటి, వీఐపీ సూట్‌లు రెండు, మినీ సూట్‌ను ఒకటి ఏర్పాటు చేశారు. ఈ అతిథి గృహానికి చుట్టూ గోదావరి జలాకళను సంతరించుకొని ద్వీప కల్పంలా ఉంటుంది. ప్రస్తుతం రంగనాయక సాగర్ రిజర్వాయర్‌లో 2.5టీఎంసీల గోదావరి జలాలు ఉన్నాయి. ప్రస్తుత నీటి మట్టం నుంచి 35మీటర్ల ఎత్తు భాగంలో ఈ అతిథి గృహం ఉంటుంది. రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 3టీఎంసీలు (490 ఎఫ్‌ఆర్‌ఎల్) ఉంటుంది. పల్లగుట్ట చుట్టూ 7.5మీటర్ల వెడల్పుతో 1.6 కి.మీటరు పొడవు రింగురోడ్డును ఏర్పాటు చేశారు. దీంతో రంగనాయక సాగర్ మంచి పర్యాటక క్షేత్రంగా మారనున్నది. ఈ కార్యక్రమంలో మంత్రులు హరీష్ రావు, నిరంజన్ రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, ఎంపి కొత్త ప్రభాకర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

# క్రీడాకారులకు చేయూత



రాజన్న సిరిసిల్లా, డిసెంబర్ 10 (నేటినిజం ప్రతినిధి):వేములవాడ మండలం శాత్రాజుపల్లి వాలీబాల్ క్లబ్ సభ్యులు వాలీబాల్ క్రీడలో అత్యంత ప్రావీణ్యం సాధించి మెరుగైన ప్రతిభ కనబరిచి అద్భుత ఫలితాలు సాధించాలనే సదుద్దేశంతో శాత్రాజుపల్లి గ్రామ తెరాస నాయకుడు మూలె బుచ్చిబాబు ప్రత్యేక వాలీబాల్ శిక్షకులు జగన్ గారిని నియమించి ప్రతి ఉదయం ఉన్నత పాఠశాల శాత్రాజుపల్లి మైదానంలో శిక్షణ కార్యక్రమం చేపట్టారు, క్రీడాకారులకు సామాజిక సేవకుడు పులి సంపత్ గౌడ్ గారు ప్రతిరోజూ ఉదయం గుడ్డు, మూలె బుచ్చిబాబు పాలు, అరటి పండు లాంటి పౌష్టికాహారం ను క్రీడాకారులకు అందిస్తున్నారు.

ఈ సందర్భంగా మూలె బుచ్చిబాబు ఈ ఉదయం శిక్షణ కార్యక్రమం సందర్శించి క్రీడాకారులను ప్రోత్సహించారు.

ఈ సందర్భంగా మూలె బుచ్చిబాబు మాట్లాడుతూ యువకులు విద్యా, క్రీడలను ప్రధాన ఆయుధంగా చేసుకొని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని యువత జీవితంలో ఉన్నత లక్ష్యాలను ఎన్నుకొని వాటి సాధన కోసం ఇష్టపడి కృషి చేయాలి.యువత విద్యతోపాటు క్రీడల్లో రాణించాలి. గ్రామీణ ప్రాంత యువకులు క్రీడల పట్ల ఆసక్తి ని పెంచుకుంటే అద్భుత ఫలితాలు సాధించవచ్చు అన్నారు, విద్యా, ఉద్యోగ అవకాశాల్లో ప్రభుత్వం రిజర్వేషన్ కల్పిస్తుంది.యువకులు క్రీడలను సాధన చేయడం ద్వారా క్రీడా సర్టిఫికెట్లను పొంది రిజర్వేషన్ల ను సద్వినియోగం చేసుకోవాలని, క్రీడలు చదువులోనే కాకుండా జీవితంలోనూ భాగమైనప్పుడు మాత్రమే ఆరోగ్యకరమైన సమాజంగా మారుతుంది.దాతల సహాయాన్ని సద్వినియోగం చేసుకుని యువకులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు,

ప్రధానోపాధ్యాయులు విక్కుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దేహానికి, దేశానికి కీర్తిప్రతిష్ఠలు అందించే క్రీడల పట్ల ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలి. ప్రభుత్వాధినేతలు వారికి పేరు ప్రతిష్ఠలు తెచ్చి పెట్టే క్రీడలను ప్రోత్సహిస్తూ మిగతా క్రీడలను, క్రీడాకారులను చిన్నచూపు చూస్తుంది.అలా కాకుండా క్రీడారంగంలో అన్ని ఆటలను పాఠశాల స్థాయి నుంచి ప్రవేశ పెట్టి పి.ఇ.టి, పి.డి.పోస్టులతోపాటు మంచి శిక్షకులతో శిక్షణ లు ఇప్పిస్తూప్రోత్సహించాలి. అప్పుడే ప్రపంచ స్థాయి క్రీడల్లో కీర్తిప్రతిష్ఠల తోపాటు పతకాల పంట అన్ని ఆటల్లో పొందగలం.క్రీడలు చిన్ననాటి నుంచి అలవడితే దేహానికి,దేశానికి మంచిది.ప్రభుత్వాలు , ప్రజలు క్రీడా రంగానికి సముచిత స్థానం కల్పిస్తూ వారి పిల్లలను యువతను పాలుపంచుకునేలా చేయవలసిన బాధ్యత మనందరి పై ఉంది. మనిషి మానసిక, శారీరక ఆరోగ్యానికి క్రీడలే పునాది " అని పేర్కొన్నారు,

ఈ కార్యక్రమంలో తెరాస నాయకుడు రేగుల రాజేశం, కొమురయ్య, మధు, బాలయ్య మరియు క్రీడాకారులు పాల్గొన్నారు.

# జగనన్న జీవక్రాంతి పథకానికి సర్కార్ శ్రీకారం

### గొర్రెలు, మేకల పంపిణీతో స్వయం ఉపాధికి ప్రోత్సాహం
### రూ.1869 కోట్ల వ్యయంతో పథకం అమలు
### వర్చువల్‌గా ప్రారంభించిన సిఎం జగన్

అమరావతి,డిసెంబర్10(ఆర్ఎన్ఎ): గత ప్రభుత్వాలు ఏనాడూ వ్యవసాయ అనుబంధ రంగాలను బాగు చేయాలని భావించలేదని సిఎం జగన్ అన్నారు. వైఎస్సార్ చేయూత, ఆసరా పథకాల్లో అక్క చెల్లెమ్మలకు స్వయం ఉపాధి కల్పించే దిశలో చేపట్టిన మేకలు, గొర్రెల పంపిణీ 'జగనన్న జీవక్రాంతి' పథకాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్యాంప్ కార్యాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా మేలు జాతికి చెందిన 2.49 లక్షల మేకలు, గొర్రెల యూనిట్ల పంపిణీకి శ్రీకారం చుట్టగా, మొత్తం రూ.1869 కోట్ల వ్యయంతో పథకం అమలు చేస్తున్నారు. కార్యక్రమం ప్రారంభంలో వైఎస్ జగన్‌కు గొంగడి కప్పి, తాటి ఆకులతో రూపొందించిన గొడుగు, మేక పిల్లను లబ్ధిదారులు బహుకరించారు. జగనన్న జీవక్రాంతి పథకం అత్యంత తృప్తి ఇచ్చే పథకాల్లో ఇది ఒకటని సిఎం జగన్ అన్నారు. వ్యవసాయంతో పాటు, మేకలు, పశువులు, కోళ్లు, చేపల సాగు వంటివి చేపడితే రైతుల కుటుంబాలకు ఎంతో అండగా ఉంటుందన్నారు. కరవు, కాటకాలు వచ్చినా అవి ఆదుకుంటాయి. రైతన్నలకు, అక్క చెల్లెమ్మలకు అదనంగా ఆదాయం కల్పించే వనరులు అన్నారు. అమూల్‌తో ఒప్పందం తర్వాత 4.69 లక్షల యూనిట్ల ఆవులు, గేదెల పంపిణీ, అంటే ఒక ఆవు దూడ లేదా కడుపుతో ఉన్న గేదె పంపిణీకి శ్రీకారం చుట్టారు. 2.49 లక్షల యూనిట్ల మేకలు, గొర్రెలు పంపిణీకి సిద్ధమయ్యారు. ఒక్కో యూనిట్‌లో 15 మేకలు లేదా గొర్రెలు. వాటిలో 14 ఆడవి కాగా, ఒకటి మగది ఉండేలా చర్యలు తీసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చేయూత, ఆసరా కింద ఊరికే సహాయం చేయడం కాకుండా, ఆ డబ్బులతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ అక్క చెల్లెమ్మలు వ్యాపారం చేసుకునేలా ప్రయత్నం చేసేలా పథకాన్ని తీర్చిదిద్దారు. దాని వల్ల అదే గ్రామంలో వారికి ఉపాధి కల్పించడంతో పాటు, ఆదాయ వనరు ఏర్పర్చినట్లు అవుతుందని భావిస్తున్నారు. దాని వల్ల బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ అక్క చెల్లెమ్మల జీవితాలు మారుతాయి. చేయూత పథకంలో ఏటా రూ.18,750 చొప్పున 4 ఏళ్లలో మొత్తం రూ.75 వేలు ఇవ్వడంతో పాటు, వారిని చేయి పట్టుకుని నడిపిస్తే బాగుంటుందని, ఒక తమ్ముడిగా, అన్నగా, ఒక కుటుంబ సభ్యుడిగా ఈ అడుగులు ముందుకు పడుతున్నాయని సిఎం జగన్ తెలిపారు. తొలి దశలో వచ్చే మార్చి చివరి నాటికి 20 వేల యూనిట్లు పంపిణీ చేయనున్నారు. రెండో విడతలో ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు 1.30 లక్షల యూనిట్లు పంపిణీ చేస్తారు. మూడో సెప్టెంబరు నుంచి డిసెంబరు వరకు 99 వేల యూనిట్లు పంపిణీ చేస్తారు. ఆ విధంగా దాదాపు 40 లక్షల మేకలు, గొర్రెలు. ఎక్కడెక్కడి నుంచో సేకరించాల్సి వస్తోంది. అందుకే మూడు దశల్లో కార్యక్రమంకొనసాగుతుంది. వ్యవసాయం, పాడి పశువుల రంగంలో ఉన్న రైతులు, అక్క చెల్లెమ్మలకు ప్రభుత్వం ఎంతో అండగా ఉంటుంది. వారికి అన్నగా, తమ్ముడిగా అండగా ఉంటానని మరోసారి భరోసా ఇస్తూ, మీరు చేపట్టబోయే ఈ వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా విలసిల్లాలని, మీకు ఇంకా మంచి జరగాలని, మీకు ఇంకా మేలు చేసే అవకాశం దేవుడు కల్పించాలని మనసారా కోరుకుంటున్నాననిసిఎం జగన్ అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాల్లో మరింత తోడుగా నిలుస్తామని ఆ తర్వాత వీడియో కాన్ఫరెన్సు ద్వారా మాట్లాడిన అల్లానా గ్రూప్ ఛైర్మన్ ఇర్ఫాన్ వెల్లడించారు. రాష్ట్రంలో మీట్ ప్రాససింగ్ యూనిట్లతో పాటు, మ్యాంగో ప్రాససింగ్ యూనిట్ కూడా ఏర్పాటుకు ఇదే సరైన సమయమని ఇర్ఫాన్ పేర్కొనగా.. జగన్ స్వాగతించారు. మరోవైపు బ్రిటన్, ఆస్ట్రేయా, దక్షిణాఫ్రికా వంటి దేశాలలో మేకలు, గొర్రెలలో మంచి బ్రీడ్ ఉందని, వాటిని ఇక్కడికి కూడా తీసుకువస్తే ఎంతో మేలు జరుగుతుందని, అందుకు తాము సహకరిస్తామని అల్లానా గ్రూప్ ఛైర్మన్ తెలిపారు. దీనిపైనా సానుకూలంగా స్పందించిన వైఎస్ జగన్, ఆ దిశలో చురుకుగా పరిశీలించాలని పశు సంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం, రెవెన్యూ మంత్రి ధర్మాన కృష్ణదాస్, మంత్రులు బొత్స సత్యనారాయణ, బాలినేని శ్రీనివాసరెడ్డి, కురసాల కన్నబాబు, డాక్టర్ సీదిరి అప్పలరాజు, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఏపీ అగ్రి మిషన్ వైస్ ఛైర్మన్ ఎంవి యస్ నాగిరెడ్డి, వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్యతో పాటు, వివిధ శాఖల ఉన్నతాధికారులు ఈ కార్యక్రమానికి హాజరు కాగా, జిల్లాల నుంచి అధికారులు, పథకం లబ్దిదారులు వీడియో కాన్ఫరెన్సు ద్వారా పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com